సెలవులైనా క్లాసులే..!

- కొనసాగుతున్న ప్రైవేటు తరగతులు
- యథేచ్ఛగా యాజమాన్యాల నిర్వహణ
- ప్రభుత్వ ఆదేశాలు లెక్కచేయని వైనం



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

నెల్లూరు(విద్య), అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి) : సెలవుల్లో తరగతులు నిర్వహించరాదన్న ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బేఖాతరు చేస్తున్నాయి. ఆదివారం, రెండో శనివారం, పండగ సెలవులు ఏమైనా సరే తరగతులు నిర్వహిస్తామంటున్నారు వారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సెలవుల్లో సైతం తరగతులు నిర్వహించిన కార్పొరేట్ విద్యాసంస్థలు దసరా సెలవుల్లోనూ తరగతులను నిర్వహించాయి. ప్రస్తుతం రెండోశనివారం, ఆదివారం కూడా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను క్లాసుల్లో బందిస్తున్నారు.

బలవంతపు చదువులు

ఓ వైపు కుటుంబ సభ్యులు, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే వారంతా సెలవుల్లో రిలాక్స్ అవుతున్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం విద్యార్థులను యంత్రాలుగా భావించి, తరగతి గదుల్లో బలవంతపు చదువులు రుద్దుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశాయి. సెలవుల్లో తరగతులు నిర్వహించకూడదని సంబంధిత అధికారులు ఆదేశాలు చేస్తున్నా, అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రెండో శనివారం సెలవు అయినా యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారు శనివారం పలు విద్యాసంస్థల్లో తరగతులను అడ్డుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వీ.నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తూ, సెలవుల్లో కూడా చదువుల పేరుతో వేధించే సంస్థలపై విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు వంశీ, విష్ణు, చరణ్, యశ్వంత్, తాహిర్, అక్రమ్, ముజాహిల్, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 12,764 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 12,764 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.929 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

బీపీసీఎల్‌కి భూకేటాయింపులు

- ఆరువేల ఎకరాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇప్పటికే 2,500 ఎకరాలకుపైగా సేకరణ

కందుకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్)కి రామాయపట్నం పోర్టుకు సమీపాన ఆరువేల ఎకరాల భూములు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. చేవూరు, గుడ్లూరు మండలం రావూరు, కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం గ్రామాల పరిధిలో ఈ భూములు సేకరించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. తొలుత ఆనెమడుగు గ్రామాన్ని కూడా భూసేకరణలో చేర్చినా, ఇటు కావలికి, అటు జాతీయ రహదారికి ఆ గ్రామం భూములు అతిసమీపంలో ఉండటంతో రూ.కోట్లు విలువజేసే భూములను తక్కువధరకు అమ్ముకోలేమని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో ఆ గ్రామాన్ని భూసేకరణ నుంచి మినహాయించినట్లు తెలిసింది. అవసరమైతే రుద్రకోట గ్రామపరిధిలో కూడా భూములను బీపీసీఎల్ కోసం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

డిసెంబరులో డీపీఆర్.. వేలాది మందికి ఉపాధి

చేవూరు, చెన్నాయపాలెం గ్రామాల్లో భూసేకరణ వేగవంతంగా జరుగుతోంది. ఈ గ్రామాల పరిధిలో ఇప్పటికే 2,500 ఎకరాలకుపైగా భూసేకరణ పూర్తయినట్లు సమాచారం. మరో రెండు నెలల్లో మొత్తం 6వేల ఎకరాల సేకరణ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. డిసెంబరులోగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సమర్పించేందుకు కూడా కంపెనీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా, బీపీసీఎల్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ పార్కు రూ.1.03 లక్షల కోట్లతో ఏర్పాటు కానున్నది. ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురును శుద్ధిచేసే కెపాసిటీతో ఈ కంపెనీ నిర్మాణం పూర్తికానున్నది. తద్వారా 3,750 మందికి ప్రత్యక్షంగానూ, మరో 10వేల మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు.

రెండువేల ఎకరాల్లో పచ్చదనం

గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ అయినందున కేటాయించిన ఆరు వేల ఎకరాల్లో 33.3 శాతం అంటే రెండువేల ఎకరాల్లో పచ్చదనాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. పర్యావరణానికి ఎలాంటి ముప్పురాకుండా పచ్చదనాన్ని నిరంతరం పరిరక్షించాల్సిన బాధ్యత బీపీసీఎల్‌దే. ఈ రిఫైనరీకి 600 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా వేస్తుండగా, ప్రస్తుతం చేవూరు వద్ద ఏర్పాటవుతున్న ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా 100 మెగావాట్లు సరఫరా అవుతుందని, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్ నుంచి తీసుకోవాలని చెబుతున్నారు.

ప్రజల భయాందోళన

ఈ రిఫైనరీ ఏర్పాటుతో పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న భయాందోళన స్థానికుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ప్రారంభమయ్యేలోగా ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించాల్సి ఉంది. డీపీఆర్ సిద్ధమైన వెంటనే ఈ ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎస్ఎఫ్‌సీ ఈడీగా ప్రసాద్

పరిశ్రమలశాఖ జీఎంకు పదోన్నతి



నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్‌సీఎం ప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది కాలంగా పరిశ్రమలశాఖ జీఎంగా పనిచేస్తున్న ప్రసాద్ ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) ఈడీగా విజయవాడకు వెళ్లనున్నారు. ఆయన వారంలో బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే జిల్లా పరిశ్రమలశాఖ జీఎంగా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

ముందే దీపావళి!

- నెల్లూరు నగరంలో స్మార్ట్ స్ట్రీట్ బజారు ప్రారంభం
- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- లబ్ధిదారులతో మాటామంతి
- మీ కళ్లల్లో ఆనందం కనిపిస్తోందంటూ హర్షం
- మంత్రి నారాయణకు అభినందన



అందరికంటే ముందు నెల్లూరు నగరానికి దీపావళి పండుగ వచ్చింది... ఆ సంబరం మహిళల కళ్లల్లో కనిపిస్తోంది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



స్మార్ట్ స్ట్రీట్ బజారును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆవిష్కరించిన శిలాఫలకం, సభలో చంద్రబాబుకు దుకాణాల కేటాయింపు పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 11,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని మైపాడు రోడ్డు సెంటర్‌లో సుమారు రూ. 8 కోట్లతో నిర్మించిన 120 దుకాణాల స్మార్ట్ స్ట్రీట్ బజారును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మార్ట్ బజారులో దుకాణాలు పొందిన లబ్ధిదారులను ఆయన పేరుపేరున పలకరిస్తూ వ్యాపార అనుభవాలు, తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో స్మార్ట్ బజారును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ వ్యాపారులను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని అన్నీ పట్టణ, నగరాల్లో మహిళలు ముందుకు వస్తారని తెలిపారు. సోలార్, వైఫై, కంటైనర్లు, మరుగుదొడ్లతో కూడిన వసతులున్న స్మార్ట్ బజారును చూస్తుంటే ముచ్చటేస్తుందని సీఎం కొనియాడారు. అందరూ కష్టపడి పని చేసి మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ స్మార్ట్ బజారును చూస్తుంటే లండన్, ప్యారీస్‌లను చూస్తున్నంటుందని కొనియాడారు. అన్నీ రకాల దుకాణాలు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.

అభివృద్ధికి చాలా వనరులున్నాయి...

నెల్లూరు జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని, అందుకు అనుకూలంగా చాలా వనరులు ఉన్నాయని సీఎం తెలిపారు. సముద్ర తీరానికి అనుకుని పోర్టులు ఏర్పడటం, జాతీయ రహదారి ఉండటం, త్వరలో విమానాశ్రయం కూడా రావడం, చెన్నై నుంచి అమరావతికి బులెట్ ట్రైన్ సౌకర్యం కూడా పరిశీలనలో ఉండటం వంటి వనరులు జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మంత్రి నారాయణ, కలెక్టర్‌లు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఏఎండీ వెంకటకృష్ణ, కమిషనర్ నందన్, మెప్మా పీడీ లీలారాణి, టీడీపీ నేత తాళ్లపాక అనురాధ, జనసేన నేత నూనె మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకి సీఎం అభినందనలు

రాష్ట్రంలో మరెక్కడ లేని విధంగా నెల్లూరులో ప్రత్యేకించి ప్రయోగాత్మకంగా స్మార్ట్ స్ట్రీట్ బజారు ఏర్పాటు చేసిన మంత్రి నారాయణను సీఎం చంద్రబాబు ప్రత్యేకించి అభినందించారు. ఇలాగే అన్నీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ త్వరలో ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి నారాయణతో పాటు కలెక్టర్, కమిషనర్, మెప్మా అధికారులను అభినందిస్తున్నట్లు సీఎం తెలిపారు.



సభలో మంత్రి నారాయణతో కలెక్టర్ హిమాన్షు శుక్లా, కమిషనర్ నందన్



కేకు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మంత్రి నారాయణ తదితరులు

మీరు జీనియస్ సర్.. : కలెక్టర్

సర్..! మీరు నిజంగా గొప్పవ్యక్తి. మేమంతా స్మార్ట్ బజారులో దుకాణాలు పొందిన లబ్ధిదారుల్లో కొందరిని ఎంపిక చేసుకుని మీతో ఎలా మాట్లాడాలని శిక్షణ ఇచ్చి ఉంచాం. కానీ మీరు వారితో మాట్లాడకుండా మరొకరితో మాట్లాడి వాస్తవాలు బయటకు లాగారు. నిజంగా మీరు గొప్ప వ్యక్తి ... అంటూ కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంతో అన్నారు. స్పందించిన సీఎం మీరు సిద్ధం చేసినవారితో మాట్లాడితే నాకు నిజాలు ఎలా తెలుస్తాయి....? ఎవరితో ఎలా మాట్లాడాలో నాకు తెలుసుగా... అనడంతో అందరిలో నవ్వులు విరిశాయి.

నా నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం సంతోషం : వీపీఆర్

ఇంత మంచి ప్రాజెక్టును నా పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఆయనకూడా వర్చువల్‌గా పాల్గొన్నారు. చంద్రబాబు ఆశీస్సులు మనందరిపై ఉండాలని, మనందరి ఆశీస్సులు కూటమి సర్కారుకు ఉండాలని ఆయన పేర్కొన్నారు.



నేను వ్యాపారినయ్యా..

స్మార్ట్ బజారు ఏర్పాటు చేయడం వల్ల నేను వ్యాపారినయ్యా..! నాకు ఓ షాపుంది. నా కాళ్ల మీద నేను నిలబడి జీవించడానికి ఈ షాపు ఎంతగానో దోహదపడుతుంది.

- సంగీత



చాలా సంతోషంగా ఉంది

మాకు సొంతంగా షాపు ఉందంటే చాలా సంతోషంగా ఉంది. ఊహించుకుంటేనే ఆనందం కలుగుతోంది. పండ్ల వ్యాపారంతో గౌరవంగా జీవించవచ్చు. మంత్రి నారాయణకు రుణపడి ఉంటాం.

- జ్యోతి



బుట్టల వ్యాపారం పెట్టుకున్నా..

బుట్టల వ్యాపారమంటే ఇప్పటి వరకు సుబేదార్ పేట వద్దనే ఉండేవి. ఇప్పుడు స్మార్ట్ బజారులో నాకిచ్చిన షాపులో బుట్టలు అమ్మే దుకాణం ఏర్పాటు చేసుకున్నా. చాలా వరకు దిగులు తగ్గింది.

- సిరిగిరి లక్ష్మి



1గ్రామ్ గోల్డ్ నగల వ్యాపారం

గ్రాము బంగారంతో తయారు చేసిన ఆభరణాలు, ఇతర గిల్ట్ నగల దుకాణం పెట్టుకున్నా. స్మార్ట్ బజారులో దుకాణం కేటాయించడం చాలా సంతోషంగా వేసింది. ఇక్కడ అన్నీ సౌకర్యాలు ఉన్నాయి.

- జీ నాగలక్ష్మి



చెప్పలేని ఆనందం

స్మార్ట్ బజారులో నాకు ఓ దుకాణం కేటాయించారు. అందులో నేను త్రీడీ డిజైన్‌తో ఫ్రేమ్స్ తయారీ షాపు పెట్టుకున్నా. నాకు నిజంగా చెప్పలేనంత ఆనందం వేస్తోంది.

- మెహరాజ్

వారు సరే... వీరి మాటేమిటీ?

- ఇప్పటికే హౌసింగ్ అధికారులపై చర్యలు
- పేదల సొమ్ము మింగిన కాంట్రాక్టర్లపై చర్యలేవి?
- ప్రతీ గోదాములో సిమెంటు, స్టీలు, ఇసుక మాయం

పేదల ఇళ్ల మాటున జరిగిన భారీ కుంభకోణంలో పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు సరే.. మరి సూత్రధారులైన కాంట్రాక్టర్ల మాటేమిటి..? పేదల సొమ్మును దోచుకున్న వీరి నుంచి రికవరీ చేయరా..? నాసిరకంగా బేస్‌మట్టాలు కట్టి రూ.కోట్లు దోచుకున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోరా..? పేదల ఇళ్లను బాగు చేయరా..? అన్న ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో జరిగిన హౌసింగ్ స్కాం ఇప్పుడు బద్దలవుతోంది. ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న వ్యవహారాలను చూసి సామాన్యులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోతున్నారు. నాడు అనేక ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇదే అలుసుగా కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు కుమ్మక్కై రూ.వందల కోట్లను దోచుకున్నారు.

నెల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఇళ్లు కట్టకుండానే కట్టినట్లు చూపించి తీసుకున్న బిల్లులు రూ.110 కోట్లు ఉన్నట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇక కట్టిన ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తే మరో రూ.వంద కోట్ల కుంభకోణం బయటపడుతుందన్నది అంచనా. ఈ పరిస్థితుల్లో నాటి అక్రమాలకు బాధ్యులుగా హౌసింగ్ అధికారులపై ఇప్పుడు వరుసపెట్టి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ పది మంది వరకు హౌసింగ్ అధికారులు సస్పెన్షన్‌కు గురవ్వగా, మరికొంత మందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఒక పక్క తప్పు జరిగిందని, ప్రజాధనం పక్కదారి పట్టిందని నిర్ధారించిన హౌసింగ్ శాఖ.. ఈ సొమ్మును నేరుగా జేబుల్లో వేసుకున్న కాంట్రాక్టర్లపై మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికి ఒక్క కాంట్రాక్టర్ నుంచి కూడా రికవరీ చేయడం గానీ, చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు.

వెలుగులోకి అక్రమాలు

జిల్లాలో నిర్మించిన ఇళ్లకు పంపిణీ చేసిన మెటీరియల్‌కు, చెల్లించిన బిల్లులకు పొంతన కుదరడం లేదు. స్టేజి కన్వర్షన్ చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు లాగేసుకున్నారు. నాసిరకంగా బేస్‌మెంట్లు నిర్మించి ఆ దామాషా బిల్లులతోపాటు సిమెంటు, స్టీలు, ఇసుకను స్వాహా చేశారు. ఇటీవల గోదాముల్లో ఉన్న నిల్వలపై హౌసింగ్ అధికారులు తనిఖీలు చేపట్టగా చాలా తేడాలు బయటపడ్డాయి. కొండ్లపూడి గోదాములో సుమారు 6 వేల బస్తాల సిమెంటు, 27 టన్నుల స్టీలు, 2500 టన్నుల ఇసుక తేడా వచ్చింది. వెంకటేశ్వరపురం గోదాములో 25 టన్నుల వరకూ స్టీలు పక్కదారి పట్టినట్లు తేలగా, పొదలకూరులో ఐదు టన్నుల స్టీలు, 800 బస్తాల సిమెంటు తేడా వచ్చినట్లు తెలుస్తోంది. మనుబోలులో అయితే ఏకంగా వెయ్యి టన్నుల ఇసుకతోపాటు 20 టన్నుల స్టీలు లెక్క తేలడం లేదు. కావలిలో కూడా సుమారు 6 వేల బస్తాల సిమెంటు, 27 టన్నుల వరకూ స్టీలు లెక్కల్లోకి రావడం లేదని తెలుస్తోంది. సంగంలో 30 టన్నుల స్టీలు, 3 వేల బస్తాల సిమెంటు తేడా రాగా, దుత్తలూరులో 22 టన్నుల స్టీలు తేడా వచ్చినట్లు హౌసింగ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరికొన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇదంతా ఎక్కడికి వెళ్లిందన్న దానిపై లోతుగా విచారణ చేయాల్సి ఉంది.



నెల్లూరులో అసంపూర్తిగా ఉన్న జగనన్న ఇళ్లు

పేదల సొమ్ముతో వ్యాపారాలు

గత ప్రభుత్వంలో లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను ఆప్షన్-3 పేరుతో వందలమంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా ఆరు అంకణాల స్థలంలో బేస్ స్థాయి నిర్మాణానికి రూ.30 వేలకు మించి ఖర్చు కాదు. అయితే ఈ బీఎల్ స్థాయి నిర్మాణం జరిగితే తొలుత రూ.50 వేలు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. ఆ తర్వాత దాన్ని రూ.70 వేలకు పెంచారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు కొట్టేశారు. బేస్ స్థాయికే ఇంత పెద్ద మొత్తం చెల్లించేలా నాడు హౌసింగ్ శాఖ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంట్రాక్టర్లు ఉన్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 82,422 ఇళ్లను మంజూరు చేయగా, అందులో 36 వేలకుపైగా ఇళ్లు నాట్ స్టార్టెట్ నుంచి బేస్ లెవల్ స్థాయిలోనే ఉన్నాయి. ఇందులో 15 వేలకుపైగా ఇళ్లకు రూ.50 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక్క నెల్లూరు జిల్లాలో పేదల ఇళ్ల పేరుతో ఇప్పటి వరకూ సుమారు రూ.900 కోట్ల వరకూ మెటీరియల్, బిల్లులు చెల్లించారు. అందులో ఒక కాంట్రాక్టర్‌కే రూ.200 కోట్లు వరకూ అందినట్లు సమాచారం. అయితే ఈ కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇళ్లు పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. పేదల సొమ్ముతో ఇతర వ్యాపారాలు చేసుకుంటూ దర్జాగా తిరుగుతున్నారు. జిల్లా స్థాయిలో కొందరు అధికారులు వీరికి నోటీసులు ఇస్తున్నప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

రాపూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్ సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపానికి తీసుకొచ్చి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేడుకగా జరిపామని ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11731
వెండి కిలో ధర	రూ. 167100
వెండి ఒక గ్రాము	రూ. 175.00

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వేదాయపాలెం రైల్వేగేటు సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉండి, తెలుపురంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బులుగు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరులో కరెంటు కష్టాలు

- 10 గంటలపాటు అవస్థలు

పొదలకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వినియోగదారులను కరెంట్ కష్టాలు వేధిస్తున్నాయి. శనివారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. చిన్నపాటి వర్షం పడినా, రాత్రి సమయాల్లో కూడా ఎక్కువ సమయం విద్యుత్ సరఫరాకి అంతరాయం తప్పడం లేదు. ఉక్కపోతతో జనం అల్లాడుతుంటే పగలూ రాత్రీ తేడా లేకుండా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా పట్టణంలో చాలాచోట్లలో ఓల్టేజీ, అధిక లోడ్ వల్ల తరచూ ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంటు లేకపోవడంతో విద్యుత్ పరికరాలు, మోటార్లు పనిచేయక తాగునీటికి ఇబ్బందులుపడ్డారు. అలాగే చిన్నారులు, వృద్ధుల బాధలు వర్ణనాతీతం. ఇరుకు ఇళ్లల్లో కరెంటు లేకుండా ఉండలేక అవస్థలు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఎలాంటిల ముందస్తు సమాచారం లేకుండా ఇలా గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

ముత్తుకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ముత్తుకూరులో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాసరావు, ముత్తుకూరు సబ్‌పోస్టు మాస్టర్ ఆవుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది 'జనంలోకి మనం' కార్యక్రమంలో భాగంగా పోస్టాఫీస్ నుంచి ముత్తుకూరు ప్రధాన కూడలి వరకు బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 10 సంవత్సరాల ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం, 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వారికి రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు ఎంతో ప్రయోజనకరన్నారు. తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ సిబ్బంది కోడూరు దామోదర్‌రెడ్డి, మురళీ, మన్సూర్ అహ్మద్, దనుష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దృష్టి దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న ముప్పవరపు ఉషమ్మ

వెంకటాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఉన్న ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ట్రస్ట్‌లోని విద్యామందిర్ పిల్లలు అవగాహన ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కంటి సంరక్షణ, దృష్టి లోపాలను నివారించడం, కంటి సమస్యలు, అంధత్వం గురించి అవగాహన కల్పించారు. అంధత్వ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రజ లు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మౌనిక, ఆసుపత్రి కార్య నిర్వాహక సిబ్బంది వెంకట్రావు, వాసుబాబు, అనూప్ బాబు, విద్యామందిర్ పాఠశాల ప్రిన్సిపాల్ సులోచన తదితరు పాల్గొన్నారు.

కార్డు ఉంటేనే యూరియా!

- రైతుల్లో ఆందోళన
- తప్పని తిప్పలు

కోవూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ కోవూరు డివిజన్ పరిధిలోని రైతులకు ముందుగానే యూరియా అందించాలని నిర్ణయించడం పలు ఇబ్బందులకు దారి తీస్తోంది. కోవూరు డివిజన్ పరిధిలోని సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లోని రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయశాఖ యూరియా సరఫరా చేయాలని నిర్ణయించింది. రైతులకు యూరియా అందించేందుకు వీలుగా కార్డుల్ని సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రతీ రైతుకు ఎకరాకు మూడు కట్టల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందించాలని వ్యవసాయశాఖ అధికారులు కార్డుల పంపిణీకి సిద్ధం చేశారు. గతంలో ఎప్పుడూ కార్డులు పంపిణీ చేయకుండానే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా సరఫరా చేశారు.

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

జిల్లాలో కోవూరు డివిజన్‌లో మాత్రమే కార్డులు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కార్డు తీసుకోవాలంటే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ వచ్చిన తరువాతే కార్డుల్ని అందిస్తారు. కార్డు కోసం రైతులు పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కార్డులు తీసుకునేందుకు, యూరియా దఫాల వారీగా ఎకరాకు మూడు కట్టలు పొందేందుకు తిప్పలు పడాల్సి వస్తోంది. శివాయిలో పంట పండించే రైతులకు కూడా కార్డులు పంపిణీ చేసి యూరియా సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖాధికారులు చెబుతుండటం విశేషం. డివిజన్ పరిధిలో ఎక్కువ మంది రైతులు పశువుల కోసం గడ్డిని పొలాల్లో పెంచుతున్నారు. వారికి యూరియా అవసరం చాలా



పడుగుపాడు సొసైటీకి చేరిన యూరియా బస్తా

ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయశాఖాధి కారుల చర్యల వల్ల పాడిపరిశ్రమతో ఉపాధి పొందే రైతులు తమకు యూరియా దొరికే అవకాశమే లేదని వాపోతున్నారు. రైతులు, కౌలురైతులను కార్డుల పేరుతో ఇబ్బంది పెట్టవద్దని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినప్పటికీ ప్రయోజనం లేదని అధికార పార్టీ రైతు విభాగం నాయకులు వాపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులందరికీ యూరియా అందిస్తారనీ, కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగవద్దనీ టీడీపీ నాయకు లు సామాజిక మాధ్యమాల్లో రైతులకు తెలియజేస్తున్నారు.

సీజన్ ప్రారంభానికి ముందే...

రబీ సీజన్‌లో వరినాట్లు వేసేందుకు ఇంకా సమయం ఉంది. ఇప్పటికీ ఇంకా పొలా ల్లో దుక్కి దున్నలేదు. వరి నార్లు పోయలేదు. ఇప్పుడే ఎకరాకు దఫాల వారీగా మూడు యూరియా కట్టల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందజేస్తామని అధికా రులు చెబుతుండటంతో రైతుల దృష్టి అప్పుడే యూరి యా సేకరణపై పడింది. యూరియా కొరత ఉందేమో నన్న ఆత్రుత రైతుల్లో నెలకొంది. నెలరోజుల వరకూ వరి, అరటి తోటలు సాగు చేసే రైతులకు యూరియా అవసరమే లేకపోయినప్పటికీ ఇప్పటి నుంచే వారిలో గు బు లు రేకెత్తే విధంగా వ్యవసా య శాఖాధికారులు ప్రచారం చేస్తుండడం గమనార్హం.

ఆందోళన వద్దు.. యూరియా అందిస్తాం: అనిత, ఏడీఏ, వ్యవసాయశాఖ, కోవూరు

రైతులందరికీ ఎకరాకు మూడు యూరియా బస్తాలను అందించాలనే ఉద్దేశంతో కార్డులు పంపిణీ చేస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో కార్డులను పంపిణీ చేస్తాం. యూరి యా అందించే సమయంలో కూడా కార్డులు ఇస్తాం. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరికీ యూరియా అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ దఫా రైతులు ఎక్కువగా బీపీటీ రకం ధాన్యం పండించనున్నారు. రైతులందరికీ యూరి యా అందుబాటులో ఉంటుంది.

బాలికలే భవిష్యత్తు.. విద్యతో వెలుగు!

ముత్తుకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కప్పలదొరువు గ్రామ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు బాలికల ప్రాముఖ్యత, విద్య ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమ్మణమ్మ మాట్లాడుతూ ప్రతీ బాలిక చదువుకోవడం ద్వారా సమాజానికి వెలుగునివ్వగలదన్నారు. చిన్నారు లకు హ్యాండ్ వాష్, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రదర్శనలు నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి ఆహార అలవాట్లు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొ న్నారు. బాలికల కోసం ఆటల పోటీలు, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాలు, పండ్లు పంపిణీ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాల్యవివాహాల గురించి అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జీ సీతాలక్ష్మి, బీ పద్మజ, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరి దేవి, ఉపాధ్యాయురాలు రాణి అంబాజి, అమరావతి, అంగన్‌వాడీ సిబ్బంది గీత, సునీత, అన్నపూర్ణ, శైలజ పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు

పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్

విడవలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు తీసు కుంటున్నామని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేష్ నాయక్ తెలిపారు. పశుగణా భివృద్ధిశాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఊటు కూరు కంచరపాళెంలో శనివారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. జేడీఏ మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం 75 శాతం రాయితీతో పశుగ్రాసాన్ని రైతులకు అందజేస్తోందన్నారు. ఈశాన్య రుతుపవనాల సమయంలో పశువు లకు, గొర్రెలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలను వేయించాలని అయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి దాసరి శ్రీనివాసరావు, కోవూరు ఏడీఏ కృష్ణ మౌర్య, పశువైద్యులు గౌతమ్, ప్రీతీసాల్మన్, రైతులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న జేడీఏ రమేష్‌నాయక్

జొన్నవాడ ఆలయ పవిత్రతను కాపాడండి

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వేమిరెడ్డి దంపతులు



బుచ్చి: ప్రమాణ స్వీకారం చేస్తున్న కామాక్షితాయి ఆలయ నూతన పాలక మండలి సభ్యులు



ఇందుకూరు పేట: పాలక మండల సభ్యులు చేత ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కొడవలూరు: బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయి ఆలయ పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు జొన్నవాడ ఆలయ నూతన పాలకమండలి సభ్యులకు సూచించారు. శనివారం జొన్నవాడ ఆలయంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జరిగిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ నూతన పాలకమండలి చైర్మన్‌గా తిరుమూరు అశోక్ రెడ్డి, సభ్యులు నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నంద కుమార్, పెన్నతూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మి, పాలూరు ఛాముండేశ్వరి, కీలుకుప్ప శ్రీనివాసులు, సూరాయపాళెం ప్రత్యూష, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, కొల్లపూడి శారద, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వారణాసి వెంకట శివగంగా ప్రసాద్‌లతో ప్రమాణస్వీకారం చేయించి నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయంలో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆలయ ఈఓ, అర్చకులు పూర్ణ కుంభం, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కర్నాటి ఆంజనే యులు, పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, గునుకుల కిషోర్, సర్పంచు పెంచలయ్య, బుచ్చి అర్బన్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగీష్, కొల్లా సుధాకర్, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీహరిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ఎంపీపీలు, సర్పంచులు, యూనిట్, క్లస్టర్ ఇన్ చార్జ్‌లు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాభివృద్ధికి పాటుపడండి

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం శ్రీచాముండేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు, పాలకమండలి సభ్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. శ్రీచాముండేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో దేవాదాయ శాఖ అధికారులు చాముండేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్‌గా గుండాల కృష్ణారెడ్డితో పాటు మరో 11 మంది ఆలయ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో భోజనశాల ప్రారంభించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి పా టుపడాలని పాలక మం డలి చైర్మన్, సభ్యులకు సూచించారు. కార్య క్రమంలో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, దు వ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వీరేంద్ర నాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, చెంచుకిషోర్, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మునగాల రంగా రావు, జనసేన నాయకులు హరికుమార్ రెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు ఆదుకుంటాం: ఎమ్మెల్యే ప్రశాంతి

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాలెంలో వినాయక కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా నాలుగు పూరిళ్లు దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుంది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. బాధి తులకు నూతన ఇళ్లు నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, నాయకులు మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, కరకటి మల్లికార్జున, గరికపాటి రాజేంద్ర కుమార్, తువ్వర ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

ఉదయగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి - బండగానిపల్లి ఘాట్‌రోడ్డు మార్గంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. రహదారికి అడ్డంగా చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉండడంతో పాటు తీగలకు తీగ జాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాక్టర్లు, లారీలు వెళ్లే సమయంలో తీగలు తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తీగల ఎత్తు పెంచడంతోపాటు అల్లుకున్న తీగ జాతి మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 1267 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 916 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 351 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ315కాగా, కనిష్ట ధర రూ69గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

పోలీసు స్టేషన్‌కు కోవూరు మాజీ ఎమ్మెల్యే

నెల్లూరు(క్రైం) అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి శనివారం సాయంత్రం నగరంలోని దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టారు. ఈ ఏడాది జూలై 31న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనలో భాగంగా జరిగిన ఘటనలపై నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డిపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైకోర్టు ఆ కేసులో బెయిల్ మంజూరు చేసింది. దీంతో శ్రీనివాసులు రెడ్డి దర్గామిట్ట పోలీసుస్టేషన్‌కు వెళ్లి సంతకం చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వింజమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరు తుందని వింజమూరు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజకుమారి పేర్కొన్నారు. శనివారం మండ లంలోని గుండెమడకల మెయి న్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం మహో త్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడీపీఓ పద్మజకుమారి మాట్లాడుతూ అక్టో బరు 16 వరకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్నామన్నారు. ఆరునెలల నుంచి మూడు సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులకు పోషకాహార ప్రాము ఖ్యతను వివరించారు. అలాగే ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్ తేజస్విని మాట్లాడుతూ కుటుంబ నిర్వహణలో పురుషుల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి బాలామృతం అందచేశారు.

C.R.I.M.E N.E.W.S

కుటుంబ కలహాలతో

వృద్ధ దంపతుల ఆత్మహత్య



వృద్ధ దంపతుల మృతదేహాలు

కలువాయి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సం ఘటన శనివారం కలువాయి మండలం అగ్రహారంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అగ్రహా రానికి చెందిన వింజం కొండయ్య (75) రత్నమ్మ (70) దంప తులు. వీరికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలు అయిపోయాయి. బ్రహ్మనాయుడు, రామా నాయుడు అనే ఇద్దరు కుమారులు వ్యాపార నిమిత్తం నెల్లూరులో ఉంటున్నారు. స్వగ్రామంలో ఉంటున్న మూడవ కుమారుడు నిరంజన్‌తో కలసి కొండయ్య దంపతులు ఉంటున్నారు. నిరంజన్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి 60 గొర్రెలు ఉన్నాయి. వాటిలో సగం గొర్రెలు తనకు పంచి ఇవ్వాలని కొండయ్య దంపతులు కుమారుడు నిరంజన్‌ను అడుగుతున్నారు. శనివారం కూడా గొర్రెలు పంచి ఇవ్వాలని కుమారుడిని అడిగారు. తరువాత చూద్దాంలే అంటూ నిరంజన్ గొర్రెలు మేపుకునేందుకు పొలంకు వెళ్లాడు. ఈనేపథ్యంలో సాయంత్రం గ్రామానికి సమీపంలోని సోమశిల దక్షిణ కాలువ గట్టున ఉన్న పొలంలో కొండయ్య, రత్నమ్మ దంపతులు చనిపోయి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించి కుమారుడికి సమాచారం ఇచ్చారు. నోటి నుంచి నురుగు వస్తుండటంతో గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి ఎస్‌ఐ కోటయ్య వివరాలు సేకరిస్తున్నారు. దంపతుల ఆత్మహత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జలసత్రం వేమయ్య

ఆత్మకూరు, అక్టో బరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు ఎస్టీ కాలనీ సమీపంలో నెల్లూరు- ముంబాయి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరం బీవి నగర్‌కు చెందిన జలసత్రం వేమయ్య తన కుమార్తె, మనవడు, మనవరాలితో కలిసి శనివారం నెల్లూరు నుంచి జమ్మలమడుగుకు కారులో బయలుదేరారు. కరటంపాడు సమీ పంలో ఎస్టీ కాలనీ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న జలసత్రం వేమయ్య (50) అక్కడి కక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె మౌనిక, మనవడు యశ్వంత్, మనవరాలు సహస్రకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి సహస్ర (2) మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

బైకుపై వెళుతూ రైల్వే ఉద్యోగి...



గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సూర్యనారాయణ

కావలి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జిల్లా కరువది నుండి నెల్లూరు జిల్లా బిట్రగుంటకు మోటారు బైకుపై విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా కావలి మండలం రుద్రకోట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రైల్వే ఉద్యోగి బొనిగల సూర్యనారాయణ (36) శనివారం మృతిచెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూడ్స్ రైలు గార్డుగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ మోటారు బైకుపై బిట్రగుంటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తెట్టు వద్ద గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనటంతో ఎగిరి రోడ్డుపక్కన ఉన్న గుంటలోపడి మృతి చెందాడు. ఉదయం 8.15కు సూర్యనారాయణ విధులకు హాజరు కావాల్సి ఉండగా, ఫోన్ లిఫ్ట్ చేయకపోవటం తో రైల్వే అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సూర్యనారాయణ మృతితో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. మృతుని భార్య అశ్విని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సీతారామపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండంగి గ్రామం స్వామిచెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలోని పొదల్లో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, తలపై పెద్ద రాళ్లు పడి ఉండడం, మృతదేహం కుళ్ళి ఆడ, మగ అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో హత్య జరిగి ఉంటుందన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఉదయగిరి సీఐ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసానికి గురైన ధాన్యం దళారి

- రెండు విడతలుగా రూ. 5 లక్షలు స్వాహా
- నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి..

సంగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడు గ్రామానికి చెందిన చేజర్ల కోటయ్య అనే ధాన్యం దళారి శుక్రవారం సైబర్ మోసానికి గురయ్యాడు. అతని అకౌంట్ నుంచి రెండు విడతలుగా రూ. 5 లక్షలు మాయమైంది. ఈమేరకు బాధితుడు శనివారం నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చేజర్ల కోటయ్య వృత్తిరీత్యా ధాన్యం దళారి. సంగం ఎస్‌బిఐ బ్యాంకులో ఖాతా ఉంది. రైతుల నుంచి ధాన్యం తీసుకెళ్లి రైస్ మిల్లర్లకు ఇస్తాడు. ధాన్యానికి చెందిన నగదు తన బ్యాంకు ఖాతాలో జమ చేయగానే రైతులకు అందచేస్తాడు. ఈ క్రమంలో శుక్రవారం తన సెల్‌ఫోన్‌కు వాట్సప్ మెసేజ్ వచ్చింది. దాన్ని ఓపన్ చేయగానే మొదట రూ. 3.5 లక్షలు నగదు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకుకు వచ్చి మేనేజర్‌కు చెప్పేలోపు మరో రూ. 1.5 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు అధికారులు ఖాతా నుంచి నగదు డ్రా చేయనీకుండా సీజ్ చేశారు. అప్పటికే సైబర్ నేరగాళ్లు కోటయ్య ఖాతా నుంచి రూ. 5 లక్షలు డ్రా చేశారు. దీంతో బాధితుడు శనివారం నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యాధిగ్రస్తులైన పిల్లలకు నెలవారి సరిపడ పౌష్టికాహారాన్ని అబైడింగ్ హోప్ చర్చ్ నిర్వాహకులు, సర్వోదయ కళాశాల పూర్వ లెక్చరర్ టైటస్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఏఎంసీ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందుకున్న చిన్నారులు

శిథిలావస్థలో దాత ఆశయం!


ఆచారివీధిలో శిథిలావస్థలో ఉన్న మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రం

- ఆలనా పాలన లేక కూలిపోయిన మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్, ఆచారివీధిలో మొగిళ్లపల్లి వెంకటసుబ్బయ్య సత్రాలు ఉన్నాయి. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ సత్రాలు ఆలనా పాలనా లేక శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ సత్రాలు కట్టిన దాత ఆశయాలు ఆవిరయ్యాయి. రైల్వేస్టేషన్ వద్ద 30 సెంట్లకు పైగా, ఆచారివీధిలో దాదాపు 81 సెంట్లకు పైగా స్థలాలు ఉన్నాయి. వాటి విలువ ప్రస్తుతం రూ.కోట్లకు చేరింది. దాత మొగిళ్లపల్లి వెంకటసుబ్బయ్య ఈ రెండు స్థలాల్లో 1905లో భవనాలు నిర్మించి, సేవా కార్యక్రమాలను ట్రస్టీల ద్వారా నిర్వహించేవారు. రైల్వేస్టేషన్ సత్రంలో అమెరికన్ ఆసుపత్రి, కస్యకల ఆసుపత్రికి కాన్పుల కోసం వచ్చే గర్భిణులకు తక్కువ ధరకు గదులను అద్దెకు ఇచ్చేవారు. అలాగే బాటసారుల కోసం చలివేంద్రం, బావులు తవ్వించారు. మద్రాసు బస్టాండ్ (ఆచారివీధి) సత్రంలో హాలు, గదులు నిర్మించారు. ఇందులో కర్మక్రతువులు చేసుకునేందుకు, జూబ్లీ ఆసుపత్రికి కాన్పుల కోసం వచ్చే గర్భిణులకు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆచారివీధి సత్రంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి దాని కైంకర్యాలకు మాగాణి భూములను కూడా ఇచ్చారు. అలాగే బాటసారులకు మజ్జిగ చలివేంద్రం వంటివి నిర్వహించారు. గదులు బాలింతలకు తక్కువ రేట్లకు అద్దెకి ఇచ్చేవారు. హాలులో ఉత్తరక్రియలు జరుపుకునే పేదవారికి ఇస్తుండేవారు. ఈ సత్రాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చే వరకు సేవా కార్యక్రమాలు యధావిధిగా జరిగాయి.

ఆచారివీధి సత్రానికి అరటికాయల గోడౌనుకు రూమ్‌లు అద్దెకిచ్చారు. వీటితోపాటు మరో 13 దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆదాయం ఉన్నా అప్పటి దేవాదాయ శాఖ అధికారులు సత్రంకు మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించచడంతో సత్రం కప్పు, గోడలు కూలిపోయి ఆ ప్రాంతం చిట్టడివిలా మారిపోయింది. ఈ క్రమంలో దుకాణదారులతో దేవాదాయ శాఖ అధికారులు మధ్య అద్దెలు పెంపుపై వివాదం జరిగింది. దీంతో దేవాదాయ శాఖ అధికారులు దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌కు వెళ్లి దుకాణదారులను ఖాళీ చేయించి, బహిరంగ వేలం ద్వారా లీజులు ఇచ్చేందుకు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కొత్తగా పాటలు పెడితే తమకు దుకాణాలు దక్కవని వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించి ఆ దుకాణాలు తమకే కేటాయించాలని కోరారు. అద్దెలు మాత్రం కోర్టుకు చెల్లిస్తున్నారు. అలాగే రైల్వే ఫీడర్స్ రోడ్డులోని మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య సత్రం కూడా శిథిలావస్థకు చేరింది. ఈ సత్రం ద్వారా దాత ఆశయాల మేరకు నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలు జరగలేదు. రైల్వే ఫీడర్స్ రోడ్డులోని సత్రానికి దాదాపు 11 దుకాణాలు ఉన్నాయి. వీరు కూడా పాత అద్దెలు సరిగా చెల్లించకపోవడంతో వారిని ఖాళీ


రైల్వేఫీడర్స్‌రోడ్డులోని మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రం దుకాణాలు


రైల్వేస్టేషన్ రోడ్డులో కూలిపోయిన మొగళ్లపల్లి వెంకట సుబ్బయ్య సత్రం

చేయించేందుకు కార్యనిర్వాహణాధికారులు దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌కి వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ ఉత్తర్వుల మేరకు 2023లో దుకాణాలకు వేలం పాటలు నిర్వహించారు. వేలంపాటలో పాల్గొన్న దుకాణదారులు ఇద్దరు మినహా మిగిలిన దుకాణదారులు తమ డిపాజిట్లు వరకు దుకాణాలు నిర్వహించుకుని తర్వాత ఖాళీ చేశారు. దీంతో ఈ దుకాణాలు మూతపడ్డాయి. మిగిలిన ఒక దుకాణదారుడు తన అద్దె రూ.6,316 ట్రిబ్యునల్ (కోర్టు)కు చెల్లిస్తున్నారు. మరొక దుకాణదారుడు నెల అద్దె రూ.19వేలు చొప్పున రెండు, మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సత్రం భవనాలు విలువైన టేకు దూలాలతో నిర్మించారు. ఆలనాపాలనా లేకపోవడంతో అవి చెదలు పట్టి దొంగలపాలయ్యాయి. మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య రెండు సత్రాలను పునఃనిర్మించి దాత ఆశయాలను కొనసాగించాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- అధికారులు అనుమతులు రావాలి...

నగరంలోని రెండు మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య సత్రాలు శిథిలావస్థకు చేరాయి. తొలుత ఆ సత్రాలు పాత భవనాలు తొలగించాలంటే అధికారుల అనుమతులు రావాల్సి ఉందని ఈవో రమణారెడ్డి తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖకు అనుమతులు కోసం లేఖలు రాశామన్నారు. ఆ శాఖ అనుమతులు రాగానే కమిషనర్ అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఎంపీ బీద మస్తాన్‌రావును సన్మానించిన కమిటీ సభ్యులు

గంగమ్మ ఆలయంలో ఎంపీ మస్తాన్‌రావు పూజలు

నెల్లూరురూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పరిధిలోని పడారుపల్లిలో వెలసియున్న గంగమ్మ ఆలయంలో శనివారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు కమిటీ సభ్యులు, అర్చక బృందం ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. గంగమ్మ ఆశీర్వాదంతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీ.రమేష్‌బాబు సూచించారు. శనివారం కొండాయపాలెం సెంటర్‌లో కమిటీ ఫర్ ఆల్కాహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే పరిణామాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు డీ.శ్రీధర్, ప్రభాకర్‌రావు, జేవీఎల్ఎన్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలకు మించి దగ్గుంటే

పరీక్షలు చేయించుకోవాలి

- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి
- నగరంలోని ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని మల్లికార్జునపురం, రాజాగారివీధిలో ని అర్బన్ ఆరోగ్య కేంద్రాలను జిల్లా లెప్రసీ ఎయిడ్స్ ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి డాక్టర్ ఎస్‌కే ఖాదరవలి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలుంటే వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వచ్చి కఫం పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల్లో పాజిటివ్ వస్తే ఆరు నెలల మందులు అన్ని ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందిస్తారని చెప్పారు. అనంతరం శోధన నగర్‌లోని బాలికల వసతి


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

గృహాన్ని సందర్శించారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత. టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నాగేంద్రబాబు, ఏఎన్ఎంలు రమణమ్మ, ముంతాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌ను కలిసిన వైసీపీ, సీపీఐ నేతలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): నగరంలోని హరనాథపురంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌ని శనివారం సాయంత్రం వైసీపీ, సీపీఐ, తదితర పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మను మసిద్దినగర్‌లోని జామియా మసీదు భూమి 13.50 సెంట్లుకు సంబంధించిన స్థలంపై చర్చించారు. దీనిపై అజీజ్ మాట్లాడుతూ ఆ స్థలం ఆక్రమణలకు గురికాకుండా స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మిస్తామని తెలిపారు. అనంతరం స్థలం అభివృద్ధి గురించి అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రతిపక్ష నేతలు సానుకూలంగా స్పందించి సలహాలు, సూచనలు తెలియజేశారు.


రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌ను కలిసిన ప్రతిపక్ష పార్టీ నేతలు

మార్కెట్ వ్యాపారులకు అండగా ఉంటా

- రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మార్కెట్లలో చిరు వ్యాపారులకు తాను అండగా ఉంటానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం సంతపేటలోని మున్సిపల్ మార్కెట్‌ను ఆయన పరిశీలించారు. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన దుకాణాలు, వాటి వ్యాపారులను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గురైన షాపులను వేగవంతంగా మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. వీటిలో సోమవారం నుంచి ఆయా వ్యాపారులు తిరిగి తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని చెప్పారు. ఇక్కడ వ్యాపారులకు ఏ కష్టం వచ్చిన తాను ఎప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తన సొంత నిధులతో మరమ్మతు పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే బాధిత వ్యాపారులను తన సొంత నిధుల నుంచి పరిహారం అందజేశానన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, నాయకులు తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి, కప్పిర శ్రీనివాసులు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.


మహిళ వ్యాపారులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి పొంగూరు నారాయణ

నర్సింగ్ విద్యార్థినుల ర్యాలీ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక నెల్లూరు నగర సమత విభాగం ఆధ్వర్యంలో శనివారం పీపీసీ ఆసుపత్రి నర్సింగ్ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు.. పీపీసీ ఆసుపత్రి నుంచి గాంధీబొమ్మ మీదుగా వీఆర్సీ సెంటర్ చేరకుని అక్కడి నుంచి తిరిగి ఆసుపత్రికి చేరుకున్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం. ఆడపిల్లను బతకనిద్దాం.. ఆడపిల్లను చదివిద్దాం.. ఆడపిల్లే దేశానికి గర్వకారణం అనే నినాదాలతో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు డాక్టర్ శీనునాయక్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, సమత విభాగం కన్వీనర్ విజయమ్మ, కల్చరల్ కమిటీ సభ్యులు పార్వతి, సుబ్రహ్మణ్యం, జేవీవీ నగర కార్యదర్శి కృష్ణ, అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు మాదాల రాము, నర్సింగ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్లుగా యాలమూరి రంగారావు, కలికి శ్రీహరిరెడ్డిలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు అహర్నిశలు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి పూర్తి సమయం కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబరు రాజేంద్రప్రసాద్, క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, జనరల్ మేనేజరు భక్తవత్సలరెడ్డి, వైద్యులు హరిత రాణి, మౌనికరెడ్డి, సబ్‌కమిటీ మెంబర్లు రజనీ, ప్రతాపరెడ్డిలు పాల్గొన్నారు.


రంగారావు, శ్రీహరిరెడ్డిలను సన్మానిస్తున్న ఆసుపత్రి వైద్యులు

సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా సోమయ్య

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వైవీ సోమయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, నగర డీఎస్పీ సింధుప్రియలను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాజరాజేశ్వరి సేవలో శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి దేవిని శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు సహాయ కమిషనర్ ఈవో కోవూరు జనార్దన్ రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం సుందరేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు ఇతర దేవతలకు విశేష పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు కుప్పించి రవిశర్మ, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామంలో ఓ ఇంటి పిట్టగోడపై పిడుగుపడి ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కామినేని పుల్లమ్మ ఇంటి పిట్ట గోడపై పిడుగు పడింది. దీంతో పుల్లమ్మ ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందన్నారు.

నవంబరు 2న అంధుల సమాఖ్య సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల సమాఖ్య జిల్లా యూనిట్ సర్వసభ్య సమావేశం నవంబరు 2న జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు షేక్ నాగార్జున, ప్రధాన కార్యదర్శి మోపూరు రామసుబ్బయ్య తెలిపారు. శనివారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పోటీ చేయదలచిన వారు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించాలని కోరారు. 21 సాయంత్రం వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉంటుందని చెప్పారు. ప్రతీ అభ్యర్థిని ముగ్గురు సభ్యులు ప్రతిపాదించాలని తెలిపారు.

బాస్కెట్ బాల్ ఛాంపియన్ జేబీ

వీఎస్‌యూ మహిళల అంతర్ కళాశాలల క్రీడలు

కావలి (టౌన్) అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూని వర్శిటీ మహిళల అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ ఛాంపియన్లుగా కావలి జేబీ జట్టు నిలిచింది. కావలి పట్టణ వీఎస్‌యు పీజీ కళాశాల నిర్వహణలో వీఎస్‌యు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు ఆధ్వర్యంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన పోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ పోటీల్లో వీఎస్‌యూ పరిధిలోని 13 కళాశాలలనుంచి 220 మంది మహి ళా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను వర్శిటీ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జేబీలోని డీఆర్ ఇండోర్ క్రీడాప్రాంగ ణంలో రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన బాస్కెట్ బాల్ ఫైనల్స్‌లో కావలికి చెందిన జేబీ డిగ్రీ కళాశాల జట్టు నెల్లూరు అలెక్సా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టుపై 10-2 స్కోర్ తేడాతో విజయం సాధించి విన్నర్స్‌గా నిలిచింది. అలెక్సా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ముఖ్య అతిథిగా జేబీ విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని ఫైనల్ పోటీలను ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీజీ కళాశాల పీడీ మణికంఠ వ్యవహరించగా, అబ్జర్వర్‌గా డాక్టర్ విజయ కళ వ్యవహరించారు. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి, నెల్లూరు బీఈడీ కళాశాల పీడీ రవీంద్రబాబు, వీఎస్‌యూ పీడీ ప్రవీణ్‌లు సహకారం అందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి అక్రమంగా బాణాసంచా తయారీ, విక్రయాలు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసి ఇందుకూరుపేట పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసులు, విడవలూరు పోలీసు స్టేషన్ పరిధిలో, కందుకూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్కో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో బాణాసంచా తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతీ ఒక్కరు మొక్క నాటండి

● హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(లీగల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి కే శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారులకు జరిగిన ఒక్కరోజు శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో హైకోర్టు జడ్జి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలత జిల్లా కోర్టు ప్రాంగణానికి వచ్చిన జడ్జికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జే శ్రీనివాస్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేద మంత్రాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ జడ్జీలు జీ ప్రవీణ్‌కుమార్, జీ.సీతాపతి పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

మనుబోలు స్టేషన్ ప్రశాంతంగా ఉంది

గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠీ



మనుబోలు ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠీ

మనుబోలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 'మనుబోలు స్టేషన్ పరిధిలో ఎక్కువ శాతం జాతీయరహదారి ఉంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోండి' అని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం ఐజీ త్రిపాఠీ తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఉదయం 8 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 19 గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. ఎలాంటి నేరాలు జరిగినా గుర్తు పట్టేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. హైవేపై క్రాసింగ్‌లు ఉన్న చోట పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హైవే అధికారులు, పోలీసులు కలిసి క్రాసింగ్‌ల వద్ద బ్రిక్లింగ్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫలితంగా వాహనదారులకు దూరంనుంచే క్రాసింగ్ ఉందన్న విషయం తెలుస్తుందని, తద్వారా వేగం తగ్గించి వెళతారన్నారు. దీపావళికి దుకాణదారులు ప్రమాదాలు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరూ టపాసులు విక్రయించరాదని, సిబ్బంది దీనిపై అవగాహన కల్పించాలన్నారు. మనుబోలు పోలీస్‌స్టేషన్ చాలా ప్రశాంతంగా ఉందని ఐజీ సిబ్బందికి కితాబిచ్చారు. అనంతరం అక్కడినుండి ఆయన తిరుపతికి బయలుదేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ. శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ. శివరాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎం జాతీయ అప్రంటీస్ షిప్ మేళా

నెల్లూరు(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి జాతీయ అప్రంటిస్ షిప్ మేళాను ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలైన కోల్గేట్, హామిల్టన్, శ్రీసిటీ, బ్లూస్టార్ శ్రీసిటీ, అశోక్‌లేలాండ్, జేసీబీ, గోల్డ్ ఫీల్డ్, భారత్‌ఫోర్డ్, టాటామోటార్స్, భార్గవి ఆటోమొబైల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మేళాలో ఉద్యోగావకాశాలు పొందాలని తెలిపారు.

ఏపీసీబీఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన ఏపీసీబీఈఏ జిల్లా కార్యవర్గం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీబీఈఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం నగరంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఏపీసీబీఈఏ రాష్ట్ర నాయకులు జే.వెంకటేశ్వరరాజు, బీ మహేష్, ఎస్‌కే మీర్ ఖాశీంవలి, కే కుమార్‌పాల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా డీ.సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ హరిబాబు, కోశాధికారిగా జే.గుర్నాథం, సంయుక్త కార్యదర్శిగా ఐ సత్యవతి, సలహాదారులుగా ఏ ఫణీంద్రబాబు, ఎస్‌కే గౌస్‌బాషా, టీ.బాబు, పీ శివ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పీ శైలవతి, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే షాజిద్, కార్యదర్శిగా ఎస్‌కే ఇబ్రహీం ఖలీల్, మహిళా కార్యదర్శిగా వీ గాయత్రి, డైరెక్టర్లుగా రఘురామయ్య, చెంగయ్య, ఎస్.కృష్ణయ్య తదితరులు ఎన్నికయ్యారు.

కీళ్ల వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు!

కీళ్ల వ్యాధులపై నిర్లక్ష్యం వద్దంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మనిషి కదల్లేని స్థితి వస్తుంది. తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కీళ్లకు పోషణ తక్కువ కావడం, అధిక బరువుతో కీళ్లపై ఒత్తిడి పెరగడంతో కీళ్ల వ్యాధుల (ఆర్థరైటిస్) బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతీ ఏటా అక్టోబరు 12న (నేడు) ప్రపంచ ఆర్థరైటీస్ డేను జరుపుకోవాలని తీర్మానించింది. ఈ సందర్భంగా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.



● వ్యాధి ముదిరితే కదల్లేని స్థితి ● జిల్లాలో 2.15 లక్షలమంది వ్యాధిగ్రస్థులు

● ఆధునిక విధానాలతో వైద్యచికిత్సలు

● నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 60 ఏళ్ల పైబడినవారికి వచ్చే కీళ్ల వ్యాధులు, నేడు యువతను సైతం పట్టి పీడిస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాధిపై అవగాహన లేకపోవడంతో కీళ్ల వ్యాధులు ప్రబలుతున్నాయి కీళ్ల జాయింట్‌లు అరిగిపోవడం, జాయింట్ వద్ద మెత్తటి ఎముకల(మృదులాస్థి) దెబ్బతినడం వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. జిల్లాలోనే 2.15 లక్షల మంది కీళ్ల వాపు వ్యాధులతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధిపై అప్రమత్తంగా లేకపోతే ముందు ముందు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్కోసారి కదల్లేక మంచానికే పరిమితం కావాల్సి వస్తుంది.

● వ్యాధిగ్రస్థులను పరిశీలిస్తే ...

జిల్లాలో కీళ్ల వ్యాధిగ్రస్తులు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నారు. నెల్లూరులోని జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగానికి ప్రతి రోజూ 100 మంది రోగులు వస్తుండగా, ఇందులో 40మంది కీళ్ల వ్యాధిగ్రస్తులే. ఇక ప్రైవేట్ ఆసుపత్రిలో కూడా ఇదే పరిస్థితి. దీన్ని బట్టి కీళ్లవ్యాధిగ్రస్థులు ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండటం, డెంగ్యూ వ్యాధి బాధిస్తుండటంతో వీరిలో ఎక్కువ మంది కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. ఇదిలా ఉంటే కృత్రిమ కీళ్లమార్పిడిలో కూడా జిల్లాలోని పలు ఆసుపత్రులు గుర్తింపును తెచ్చుకున్నాయి. జిల్లాలో ప్రతి నెలా 60 నుంచి 100 వరకు కీళ్ల మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి.

● నివారణకు ఆధునిక వైద్యవిధానాలు

కీళ్ల అరుగుదల వల్ల వచ్చే కీళ్లవాపు, వ్యాధులకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. నాలుగు దశల్లో ఈ వ్యాధికి చికిత్సలు అందిస్తున్నారు. మొదటి దశలో వైద్యుడి సంప్రదించి పెయిన్ కిల్లర్స్ వాడడం, ఫిజియోథెరపీ చేయించుకోవడం, రెండో దశలో కీళ్లలో జిగురు కోసం మందులు వాడటం, మూడవ దశలో ఆర్థోస్కోపీ ద్వారా లోపల జాయింట్‌లు శుభ్రపరచడం చేస్తారు. నాల్గవ దశలో కీళ్ల మార్పిడి(టోటల్ జాయింట్ రీప్లేస్‌మెంట్) చేస్తారు. కీళ్ల వ్యాధులు ఒకసారి వస్తే దీర్ఘకాలం పాటు మందులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు



కీళ్లవ్యాధులకు సంబంధించి నేడు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. పురుషుల్లో కంటే స్త్రీలలోనే ఎక్కువగా కీళ్ల వ్యాధులు వస్తున్నాయి. ఊబ కాయం, పోషకాహారలోపం, కాల్షియం లోపం, నిద్రలేమి, ఒత్తిడి, డిప్రెషన్ వంటి కారణాల వల్ల కూడా ఈ వ్యాధులు వస్తుంటాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా సోరియాటిక్, సెప్టిక్ వంటి వాటివల్ల కీళ్ల వ్యాధులు వస్తుంటాయి. రక్తంలోని ప్లాస్మాను తీసి కీళ్ల జాయింట్‌లో ఎక్కించటం ద్వారా కీళ్ల వ్యాధులను నివారించవచ్చు. కృత్రిమ కీళ్లు 20 నుంచి 30 ఏళ్లపాటు ఉపయోగపడేలా వీటిని రూపొందిస్తున్నారు.

- డాక్టర్ మస్తాన్‌బాషా, కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు, జీజీహెచ్

నిర్లక్ష్యం చేస్తే వైకల్యమే...



వాక్‌థాన్‌లో అపోలో వైద్యులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థరైటిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే శారీరక వైకల్యం తప్పదని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా శనివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆరో నగర సీఐ సాంబశివరావు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో వైద్యులు మాట్లాడుతూ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని తక్కువ ఫీజుతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ విక్రమ్ రెడ్డి, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కండలేరు జలాశయం నీటి నిల్వ 59.50 టీఎంసీలు

రాపూరు, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.55 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 3400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో, హెడ్ రెగ్యులేటర్ నుండి 2150 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని అధికారులు పేర్కొన్నారు.

రేషన్ మాఫియాకు అధికారుల సహకారం

● నెల్లూరు రూరల్, కోవూరులో పెద్ద ఎత్తున అక్రమ రవాణా

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కొంత మంది అవినీతి అధికారుల సహకారంతోనే రేషన్ మాఫియా చెలరేగిపోతోందని, దీని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. నెల్లూరు ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల బియ్యాన్ని బొక్కేస్తున్న పందికొక్కులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జాయింట్ కలెక్టరును సైతం సివిల్ సప్లైస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని, ఈ అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోకపోతే తానే స్వయంగా అడ్డుకుంటానని, తక్షణం అక్రమార్కులపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సుభానీనగర్‌లో పట్టుబడిన లారీల్లో రేషన్ బియ్యం ఉంటే కేవలం రెండు లారీల్లోనే రేషన్ బియ్యం ఉన్నాయంటూ మిగిలిన లారీలను అధికారులు వదిలేశారని ఆరోపిం చారు. దళారీ అయిన మహేష్‌రెడ్డిపై మాత్రమే కేసు నమోదు చేశారని, సూత్రధారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే అతనిపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ మాఫియాకు సహకరిస్తున్న సివిల్ సప్లైస్ విజిలెన్స్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతోందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నా రేషన్ మాఫియా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు చెడ్డ పేరు వచ్చేలా ఎవరు వ్యవహరించినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ మాఫియాపై లోతుగా విచారణ జరిపించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తానెప్పుడూ ప్రజాపక్షమేనని చెప్పారు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలోని పేదల బియ్యాన్ని డాన్ స్మగ్లింగ్ చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో చెప్పాలన్నారు.

నేటి నుంచి గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ కిరణ్‌కుమార్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : గ్రేట్ సింహపురి షాపింగ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆదివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్‌లో జరుగుతుందని వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఇందిరాభవన్‌లో గ్రేట్ సింహపురి ఎలక్ట్రానిక్స్ ఫెస్టివల్ పేరుతో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను విడుదల చేశారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రేట్ సిం హపురి షాపింగ్ ఫెస్టివల్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు టూ వీలర్స్, ఇన్సూరెన్స్ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు తదితరాల ప్రదర్శన, అమ్మకాలు ఉం టాయని తెలిపారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించడం, తద్వారా వినియోగదారులకు లభించే వాస్తవ ప్రయోజనాలను వారికి తెలియచేయటమే ఈ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు.

1100కుపైగా ప్రాజెక్టుల ప్రారంభం

● ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మౌలిక సదుపాయాలనిధి, పశుసంవర్థక, మత్స్యశాఖ, ఆహార ప్రాసెసింగ్ రంగంలో మొత్తం 1100 లకుపైగా ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రధానమంత్రి దేశ రైతులకు రూ.42 వేల కోట్ల విలువైన వ్యవసాయ ప్రాజెక్టులను సమర్పించే అన్నదాతల గౌరవం సమృద్ధి భారత నిర్మాణం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ పప్పుధాన్యాలు, నూనెగింజలకు సంబంధించి కొత్త ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభిస్తున్నారన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీ.లలితాశివజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొదలకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ప్రసన్నరాజేష్, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయం డీపీడీ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి, పక్కన వ్యవసాయాధికారులు

మాలకొండలో అభివృద్ధి పనులు

వలేటివారిపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ముందుగా ఆయన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించి భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రాన్ని సందర్శించి అన్నదాన కార్యక్రమ నిర్వహణ, భోజన వసతి ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. మాలకొండ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయం రూ. 13,19,816

మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి శనివారం రూ.13,19,816 ఆదాయం వచ్చింది. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అష్టోత్తర టిక్కెట్ల ద్వారా రూ.10,400, కుంకుమార్చన టిక్కెట్ల ద్వారా 22,880, వివాహ టిక్కెట్ల ద్వారా 15,000, తలనీలాల ద్వారా రూ.43,175, వాహన పూజల ద్వారా రూ3,360, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3 58,900, స్థల పురాణం ద్వారా రూ. 800, రూం అద్దెల ద్వారా రూ. 27,780, కవర్ల ద్వారా రూ.10,425, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,56,660, అన్నదానం ద్వారా రూ.5,30,172, విరాళాల ద్వారా రూ.40,264 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్ చంద్రశేఖర్ చెప్పారు.

శ్రీగంధం చెట్టు నరికివేత

ఉదయగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపాన గల గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తోటలో గుర్తుతెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్టు నరికి తీసుకెళ్లిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తోటలో 35 ఏళ్లుగా శ్రీగంధం చెట్టు పెంచుతున్నామని, రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఒక చెట్టు నరికి తీసుకెళ్లారని రైతు తెలిపారు. ఆ చెట్టు విలువ సుమారు రూ.7 నుంచి రూ.8 లక్షల ఉంటుందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఒకే గొడుగు కిందకు గ్రామీణ బ్యాంకులు

● రాష్ట్రంలో ఉన్న నాలుగు కలిపి ఏపీ గ్రామీణ బ్యాంకుగా రూపాంతరం

● కొనసాగుతున్న సాంకేతిక అనుసంధానం

● రేపటి వరకు సేవలు నిలిపివేత

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రాంతాల వారీగా గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఆ బ్యాంకుల పరిధిలోనే సేవలు అందేవి. తాజాగా ఈ గ్రామీణ బ్యాంకులన్నీ విలీనం అవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం నాలుగు గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ బ్యాంకులన్నింటినీ కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించింది. ఈ ప్రకటన తరువాత సాంకేతిక అనుసంధాన పనులు జరగలేదు. సోమవారం వరకు ఈ అనుసంధాన పనులు ఉంటాయి. దీంతో ఆ బ్యాంకు కార్యకాపాల్లో అంతరాయం ఏర్పడనున్నది. రాష్ట్రంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నాలుగు బ్యాంకుల డేటాను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకితీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా ఈనెల 13 వరకు అన్నీ రకాల బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచి పోనున్నాయి. శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవులు అయినా, సాధారణంగా పని చేసే ఆన్‌లైన్ సేవలు కూడా అందుబాటులో ఉండవని అధికారులు తెలిపారు. సేవల్లో అంతరాయం ఏర్పడనున్నందున ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. సాంకేతిక డేటా వంటి విలీన పనులు పూర్తయితే లావాదేవీలలో వేగం పెరగనుంది. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి.



డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 1267 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 916 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 351 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ315కాగా, కనిష్ఠ ధర రూ69గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11731
వెండి కిలో ధర	రూ. 167100
వెండి ఒక గ్రాము	రూ. 175.00

న్యూస్ బాక్స్

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు మెర్సీ

ఆత్మకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలికల ప్రభుత్వ వసతిగృహంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లను పుట్టనిద్దాం.. ఎదగనిద్దాం.. చదవనిద్దాం, బతకనిద్దాం.. ఆడపిల్లలే దేశానికి గర్వకారణమని నినాదాలు చేశారు. భ్రూణహత్యలను తగ్గించి అమ్మాయిల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజి జువా లజీ లెక్చరర్ వై మెర్సి, ఎచ్‌డబ్ల్యువో ఖాదరున్నీసా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ సెక్రటరీ మహ్మద్ సాధిక్‌హుస్సేన్, జెవివి నాయకులు కెసా కృష్ణయ్య, బంటేరు మల్లికార్జున, బి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని వైసీపీ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ లీగల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేశు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి విజయలక్ష్మి

వింజమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వసతిగృహంలోని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పి విజయలక్ష్మీ సూచిం చారు. శనివారం స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలలో విద్యా ర్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పరిశుభ్రత వల్ల కలిగే ప్రయో జనాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు భారతి, భాస్కర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా తారు రోడ్డు పనులు



వంగల్లు - మర్రిపాడు గ్రామాల మధ్య నిర్మిస్తున్న తారు రోడ్డు

సంగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు - మర్రిపాడు గ్రామాల మధ్య తారు రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. గత కొంత కాలం నుంచి అధ్వానంగా ఉన్న రహదారి నిర్మాణానికి ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎండీఆర్ నిధుల నుంచి రూ. 2.75 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో వెట్‌మిక్స్ పనులు చేసిన కాంట్రాక్టర్ రెండు రోజుల నుంచి జోరుగా తారు రోడ్డు పనులు చేస్తున్నారు. చాలా ఏళ్ల తరువాత అధ్వానంగా ఉన్న జంగాలకండ్రిక, మర్రిపాడు గ్రామాలకు తారు రోడ్డు వేస్తుండడంతో రెండు గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరి పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

● డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం ● చినుకుపడితే వీధులు జలమయం ● కలగా మిగిలిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణం



వర్షపు నీటితో నిండిన ఉదయగిరి పంచాయతీ బస్టాండ్



ఉదయగిరి పట్టణంలో వర్షపు నీటితో కాలువల్లా వీధులు

ఉదయగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు అవస్థలు పడు తున్నారు. ప్రస్తుతం పట్టణంలో సుమారు 3,814 నివాసాలు ఉండగా 17 వేలమంది జనాబా నివసిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగంతా రహదారులపైకి చేరడం, చినుకుపడితే వీధులు కాలువల్లా మారడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, దిలావర్‌భాయ్ వీధి, సుద్ధబావి వీధి, యాదవపాళెం, సినిమాహాలు వీధి, నాగులబావి వీధి, వాయుగుండ్లవారి వీధి, అగ్రహారం, దేవలాలగడ్డ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉండడంతోపాటు దోమలకు నిలయంగా మారి ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. సుద్ధబావి వీధిలో మురుగు నీరు రోడ్లపై ప్రవహించి పాదచారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.

చినుకు పడితే చిత్తడే

పట్టణంలో దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన కాలువలే వినియోగిస్తున్నారు. పెద్ద, చిన్న కాలువలకు అనుసంధానం లేకపోవడంతో ఇక్కట్లు తప్పడంలేదు. దీనికితోడు మురుగు కాలువలను ఆక్రమించి, మూసేసి కట్టడాలు చేపట్టడంతో నీరు సజావుగా సాగడంలేదు. దీంతో వర్షం కురిస్తే డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహిస్తుండడంతో వీధులు, బస్టాండ్ ప్రాంతాలు కాలువలు, చెరువులను తలపిస్తాయి. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

ప్రతిపాదనలకే పరిమితం

గత ప్రభుత్వ హయాంలో ఉదయగిరి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం గతంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు అన్ని ప్రాంతాల్లో కొలతలు సేకరించారు. నివేదికలు తయారు చేసి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఉదయగిరి పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ డ్రైనేజీ వ్యవస్థను చూసి వెంటనే భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి భూగర్భ డ్రైనేజీ నిర్మాణం జరిగితే తమ సమస్యలు తీరుతాయని పట్టణ వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యే కాకర్లపై విమర్శలు అర్థరహితం



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వింజమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి ఇన్‌చార్జ్ రాజగోపాల్‌రెడ్డి విమర్శలు అర్థరహితమని మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో టీడీపీ ముఖ్య నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గూడా నర్సారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మీరు చేసిన అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మీలో మార్పు రాలేదని, ఒకరిని విమర్శించే ముందు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఉదయగిరి ఇన్‌చార్జ్ రాజ గోపాల్‌రెడ్డికి సూచించారు. ప్రతి గడపలోని సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్న నాయకుడు కాకర్ల సురేష్ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సీ రమణారెడ్డి, ఎంపీపీ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంగి రమణయ్యయాదవ్, తదితరులు పాల్గన్నారు.

ముళ్లపొదల్లోకి దూసుకుపోయిన లారీ



రోడ్డు పక్కన ముళ్ల పొదల్లోకి దూసుకు వెళ్లిన లారీ

సంగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిలో కొండ దిగువ భాగంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ముళ్ల పొదల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బళ్లారి నుంచి ఐరన్ వోర్‌తో వస్తున్న లారీ మార్గమధ్యంలో సంగం కొండ దిగే క్రమంలో వేగంగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బారీకేడ్‌లు ఢీకొని ముళ్లపొదల్లోకి దూసుకువెళ్లింది. ఈ సంఘటన జరిగిన స్థలం కొండ ప్రాంతం కావడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న సంగం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి వంతెనను ఢీకొన్న బొలెరో వాహనం

● స్తంభించిన ట్రాఫిక్



వంతెన వద్ద నుంచి పక్కకు తీసిన బొలెరో వాహనం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపాన 565 జాతీయ రహదారిపై గల పిల్లా పేరు వంతెనను శనివారం బొలెరో వాహనం ఢీకొంది. వివరాల మేరకు.. విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న బొలెరో వాహనం అదుపు తప్పి వంతెనను ఢీకొంది. వెంటనే డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే వాహనం రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పక్కకు తీసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

సాగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్య


● వాహనదారులు, ప్రజల అవస్థలు



సాగరంలో ట్రాఫిక్‌తో ఆగిన వాహనాలు

అనంతసాగరం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పెడుతున్నా పోలీసు సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇక అక్రమ కట్టడాలు రోడ్డు మీదకు విస్తరించడంతో సమస్య జఠిలంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ కట్టడాలు తొలగించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారి ఆలయంలో నిర్వ హిస్తున్న వసంతాల వేడుకల్లో భాగంగా శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా వేద పండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, మహా పూర్ణాహుతి, కలశాభిషేకం తదితర పూజా కార్యక్రమాలతో పాటు వేద మంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, పొద మాధవ రావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వింజమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వింజమూరు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజకుమారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండెమడకల మెయి న్ అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడీపీవో పద్మజకుమారి మాట్లాడుతూ అక్టోబరు 16 వరకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆరునెలల నుంచి మూడు సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులకు పోషకాహార ప్రాము ఖ్యతను వివరించారు. అలాగే ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్ తేజస్విని మాట్లాడుతూ కుటుంబ నిర్వహణలో పురుషుల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఐసీడీఎస్ ద్వారా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాలను ఏవిధంగా వాడాలనే దానిపై అవగాహన కల్పించారు. బాలామృతం, బాల సంజీవిని కిడ్స్, గుడ్లు, పాలు క్రమం తప్ప కుండా తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధా, శ్రీదేవి, ప్రకృతి, ఎంఎల్‌హెచ్‌పీ నాగమల్లేశ్వరి, ఆశా వర్కర్ లక్ష్మీదేవి, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ హెల్పర్లు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్‌ఐ



రోడ్డుపై రేడియం స్టిక్కర్లు అంటించిన డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ

సంగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై ప్రమాదాల నివా రణకు ఎస్‌ఐ రాజేష్ చర్యలు చేపట్టారు. తరచుగా ప్రమాదాలు జరిగే చోట్ల వాహన వేగ నియంత్రణ చర్యలను శనివారం ఎస్‌ఐ చేప ట్టారు. అందులో భాగంగా పెర మన, సంగం దువ్వూరు తదితర చోట్ల రేడియం స్టిక్కర్లు అంటిం చిన డ్రమ్ములను రోడ్డుపై ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

ఉదయగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి - బండగానిపల్లి ఘాట్‌రోడ్డు మార్గంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. రహదారికి అడ్డంగా చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉండడంతో పాటు తీగలకు తీగ జాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాక్టర్లు, లారీలు వెళ్లే సమయంలో తీగలు తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తీగల ఎత్తు పెంచడంతోపాటు అల్లుకున్న తీగ జాతి మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

కుటుంబ కలహాలతో

వృద్ధ దంపతుల ఆత్మహత్య



వృద్ధ దంపతుల మృతదేహాలు

కలువాయి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం కలువాయి మండలం అగ్రహారంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అగ్రహారానికి చెందిన వింజం కొండయ్య (75) రత్నమ్మ (70) దంప తులు. వీరికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలు అయిపోయాయి. బ్రహ్మానాయుడు, రామానాయుడు అనే ఇద్దరు కుమారులు వ్యాపార నిమిత్తం నెల్లూరులో ఉంటున్నారు. స్వగ్రామంలో ఉంటున్న మూడవ కుమారుడు నిరంజన్‌తో కలసి కొండయ్య దంపతులు ఉంటున్నారు. నిరంజన్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి 60 గొర్రెలు ఉన్నాయి. వాటిలో సగం గొర్రెలు తనకు పంచి ఇవ్వాలని కొండయ్య దంపతులు కుమారుడు నిరంజన్‌ను అడుగుతున్నారు. శనివారం కూడా గొర్రెలు పంచి ఇవ్వాలని కుమారుడిని అడిగారు. తరువాత చూద్దాంలే అంటూ నిరంజన్ గొర్రెలు మేపుకునేందుకు పొలంకు వెళ్లాడు. ఈనేపథ్యంలో సాయంత్రం గ్రామానికి సమీపంలోని సోమశిల దక్షిణ కాలువ గట్టున ఉన్న పొలంలో కొండయ్య, రత్నమ్మ దంపతులు చనిపోయి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించి కుమారుడికి సమాచారం ఇచ్చారు. నోటి నుంచి నురుగు వస్తుండటంతో గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి ఎస్‌ఐ కోటయ్య వివరాలు సేకరిస్తున్నారు. దంపతుల ఆత్మహత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జలసత్రం వేమయ్య

ఆత్మకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు ఎస్టీ కాలనీ సమీపంలో నెల్లూరు- ముంబాయి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరం బీవి నగర్‌కు చెందిన జలసత్రం వేమయ్య తన కుమార్తె, మనవడు, మనవరాలితో కలిసి శనివారం నెల్లూరు నుంచి జమ్మలమడుగుకు కారులో బయలుదేరారు. కరటంపాడు సమీపంలో ఎస్టీ కాలనీ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న జలసత్రం వేమయ్య (50) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె మౌనిక, మనవడు యశ్వంత్, మనవరాలు సహస్రకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి సహస్ర (2) మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

బైకుపై వస్తూ రైల్వే ఉద్యోగి...



గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సూర్యనారాయణ

కావలి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జిల్లా కరువది నుండి నెల్లూరు జిల్లా బిట్రగుంటకు మోటారు బైకుపై విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా కావలి మండలం రుద్రకోట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రైల్వే ఉద్యోగి బొనిగల సూర్యనారాయణ (36) శనివారం మృతిచెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూడ్స్ రైలు గార్డుగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ మోటారు బైకుపై బిట్రగుంటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తెట్టు వద్ద గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనటంతో ఎగిరి రోడ్డుపక్కన ఉన్న గుంటలోపడి మృతి చెందాడు. ఉదయం 8:15కు సూర్యనారాయణ విధులకు హాజరు కావాల్సి ఉండగా, ఫోన్ లిఫ్ట్ చేయకపోవటంతో రైల్వే అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సూర్యనారాయణ మృతితో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. మృతుని భార్య అశ్విని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో

గుర్తుతెలియని వ్యక్తి...

సీతారామపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్రంగి గ్రామం స్వామిచెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలోని పొదల్లో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, తలపై పెద్ద రాళ్లు పడి ఉండడం, మృతదేహం కుళ్ళి ఆడ, మగ అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో హత్య జరిగి ఉంటుందన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఉదయగిరి సీఐ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసానికి గురైన ధాన్యం దళారి

● రెండు విడతలుగా రూ. 5 లక్షల స్వాహా
● నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు
● ఆలస్యంగా వెలుగులోకి..

సంగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడు గ్రామానికి చెందిన చేజర్ల కోటయ్య అనే ధాన్యం దళారి శుక్రవారం సైబర్ మోసానికి గురయ్యాడు. అతని అకౌంట్ నుంచి రెండు విడతలుగా రూ. 5 లక్షలు మాయమైంది. ఈమేరకు బాధితుడు శనివారం నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చేజర్ల కోటయ్య వృత్తిరీత్యా ధాన్యం దళారి. సంగం ఎస్‌బిఐ బ్యాంకులో ఖాతా ఉంది. రైతుల నుంచి ధాన్యం తీసుకెళ్లి రైస్ మిల్లర్లకు ఇస్తాడు. ధాన్యానికి చెందిన నగదు తన బ్యాంకు ఖాతాలో జమ చేయగానే రైతులకు అందచేస్తాడు. ఈ క్రమంలో శుక్రవారం తన సెల్‌ఫోన్‌కు వాట్సప్ మెసేజ్ వచ్చింది. దాన్ని ఓపన్ చేయగానే మొదట రూ. 3.5 లక్షలు నగదు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకుకు వచ్చి మేనేజర్‌కు చెప్పేలోపు మరో రూ. 1.5 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు అధికారులు ఖాతా నుంచి నగదు డ్రా చేయనీకుండా సీజ్ చేశారు. అప్పటికే సైబర్ నేరగాళ్లు కోటయ్య ఖాతా నుంచి రూ. 5 లక్షలు డ్రా చేశారు. దీంతో బాధితుడు శనివారం నెల్లూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామంలో ఓ ఇంటి పిట్టగోడపై పిడుగుపడి ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కామినేని పుల్లమ్మ ఇంటి పిట్ట గోడపై పిడుగు పడింది. దీంతో పుల్లమ్మ ఇంటికి చెందిన కరెంటు వైరింగ్, టీవీ ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితురాలు వాపోయింది. అయితే అదృష్టవశాత్తు ఇంటిలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల పంచాయతీలోని రాళ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్లపల్లి వెంకటేశ్వర్లు మనవరాలు వివాహ వేడుకల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండ్లి కుమార్తె ఉమామహేశ్వరిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాలేపాటి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

కావలి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు త్వరగా కోలుకోవాలని కమ్మ సంఘం నాయకులు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం కావలి పెద్ద చెరువులోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. మాలేపాటికి గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావటంతో అమరావతిలోని మణిపాల్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాలేపాటి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కమ్మసంఘం అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఆకాంక్షించారు.

వెల్లటూరివారిపాలెంలో పోషకాహార మాసోత్సవాలు

కొండాపురం, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. సచివాలయ ఎమ్ఎల్‌హెచ్‌పీ మార్గరెట్ బాలికా సంరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలద్వారా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని గర్భిణిలు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కే శివకుమారి, ఎం శ్రీదేవి, ఎస్ మమత, కే వరలక్ష్మి, రమణమ్మ, విజయలక్ష్మి, గోపీచందన, వరమ్మ, సుల్తానమ్మ, ఆశా కార్యకర్తలు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించి, గోతులు పూడ్చి...

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో పంటపొలాలకు వెళ్లే మార్గం ఇరువైపులా ముళ్ళచెట్లు ఏపుగా పెరిగాయి. రోడ్డుపై గోతుల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు రైతు రామోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో స్పందించిన ఆయన సొంత నిధులతో కిలో మీటరు మేర పెరిగిన ముళ్ళచెట్లను తొలగించడంతో పాటు గోతులను పూడ్పించడంతో గ్రామస్తులు రామోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పదివేల సంతకాలు చేయిస్తాం..

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదువేల సంతకాలను సేకరణను నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. పదివేల సంతకాలను సేకరిస్తామని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు తెలిపారు. బోగోలు వైసీపీ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అవమానించిన వారిని అరెస్టు చేయాలి'

బిట్రగుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పేడ, గ్రీస్ పూసి అవమానించినవారిని వెంటనే అరెస్టు చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోచి పాతల వెంకటేశ్వర్లు ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ నెల 13న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే భారీ నిరసన కార్యక్రమానికి మాదిగలు అధికసంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు వై జయరాజు, ఏ ఏసు మాదిగ, అండ్ర బుద్దయ్య, అంకయ్య, ఏ నవీన్ కుమార్, బీ ఫిలిప్, క్రిష్ణయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలు, ఆర్థిక మోసగాళ్లపై అవగాహన కల్పిస్తున్న సీఐ అన్వర్‌బాషా, టౌన్ ఎస్ఐ శివనాగరాజు తదితరులు

కందుకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఆర్థిక నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సీఐ అన్వర్‌బాషా సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని కోటారెడ్డి ఆసుపత్రి సెంటర్‌లో ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలు, ఆర్థిక మోసగాళ్లపై అవగాహన కల్పించారు. ఆర్థిక నేరగాళ్లు ఏవిధంగా ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తారో సోదాహరణంగా వివరించటంతో పాటు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర సమయాల్లో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబరు 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శివనాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు హక్కుల గురించి తెలుసుకోవాలి



లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి, తదితరులు

లింగసముద్రం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఐసిడిఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ ఏవి రాధాదేవి సూచించారు. శనివారం లింగసముద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలు, విద్యాహక్కు, పోషకాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సీహెచ్ రమాదేవి, సీహెచ్ ప్రభావతి, బి బుజ్జమ్మ, ఆయా కుమారి, ఆశా వర్కర్ సీహెచ్ కోటమ్మ, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ కన్వీనర్ ఓంకారం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఓంకారం

కొండాపురం, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మండల టీడీపీ మాజీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం శనివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలతో పాటు, కొండాపురంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం తెలిపారని ఓంకారం తెలిపారు.

మాలేపాటికి పలువురి నేతల పరామర్శ



మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

కావలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురై శస్త్ర చికిత్స చేయించుకుని తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడిని శనివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఏపీ కనీస వేతన సలహా మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారా లోకేష్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అన్నదమ్ములపై దాడి

కావలి రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పాత గొడవలు మనసులో పెట్టుకుని తమపై స్నేహితులు కర్రతో దాడి చేశారని పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన అన్నదమ్ములు సాయిక్రిష్ణ, తేజ శనివారం ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, సాయిక్రిష్ణ, తేజ పట్టణంలోని సింగ్ స్వీట్ స్టాల్‌లో పనిచేస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున టీచర్స్ కాలనీ సమీపంలో సాయిక్రిష్ణ, తేజ టీ తాగుతుండగా ముసునూరుకు చెందిన చీమల అవినాష్, పవన్‌కుమార్, రవితేజ, సుధీర్ కుమార్ కర్రతో దాడి చేస్తూ కులం పేరు తో దూషించారు.

సీజేఐపై దాడిని ఖండించిన దళిత సంఘాలు

కావలి (టౌన్) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తు దళిత సంఘాలు శనివారం ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నేతలు నిరసన తెలిపారు. మతోన్మాదులు రాజ్యాంగాన్ని తమ చేతుల్లో తీసుకుంటున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంటి వెంకటేశ్వర్లు, మేడికొండ సుకుమార్, గంధం ప్రసన్న, నారాయణ, జ్యోతి బాలు, ఆనంద్, పుల్లయ్య, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్‌గా కలికి శ్రీహరిరెడ్డి

కావలి, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్‌గా కావలికి చెందిన కలికి శ్రీహరిరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. క్యాన్సర్ ఆసుపత్రిలో జరిగిన క్యాన్సర్ ఆసుపత్రి నిర్వహణ కమిటీ, దాతల సమావేశంలో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కో ఆర్డినేటర్లుగా యాలమూరి రంగారావు (రంగయ్యనాయుడు)తో పాటు కలికి శ్రీహరి రెడ్డిని నియమించారు.

ఆకుల మాలకొండయ్య మృతి టీడీపీకి తీరనిలోటు

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల మాలకొండయ్య (71) మృతి పార్టీకి తీరని లోటని మండల మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు తెలిపారు. రామానుజపురానికి చెందిన మాలకొండయ్య కొంతకాలంగా అనారోగ్యంతో శనివారం మరణించాడు. విషయం తెలుసుకున్న కొమ్మి గ్రామ, మండల టీడీపీ నాయకులు పార్టీకి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కొండాపురం, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గేదె మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని భీమవరప్పాడులో చోటుచేసుకుంది. గుది వెంకయ్య గేదెలను ఆరుబయట కట్టివేయగా, వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పిడుగు పడడంతో ఓ గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రూ1.20 లక్షల ఖరీదు చేస్తుందని బాధితుడు వెంకయ్య వాపోయాడు. సాయిపేట పశువైద్యాధికారి మధు గ్రామానికి వచ్చి గేదె మృతదేహాన్ని పరిశీలించి పంచనామా చేయించారు. ప్రభుత్వం నుండి పరిహారం అందేలా చూస్తానని బాధిత రైతుకు హామీ ఇచ్చారు.

చెకుముకి గోడ పత్రికల ఆవిష్కరణ

కావలి (టౌన్) (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేవీవీ కార్యాలయంలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు చెకుముకి సైన్స్ పోటీలు దోహదపడతాయన్నారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్టోబరు 18న మండల, పట్టణ స్థాయి, నవంబరు 1న జిల్లా స్థాయి, నవంబరు 23న రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీలలో చెకుముకి టాలెంట్ టెస్టులు జరుగుతాయన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు.



తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయ రాజగోపురం

ఐదు సెంట్లు హాంఫట్

తిరుపతి ఆలిండియా రేడియో కార్యాలయం వెనుకవైపు ఒకే ఆవరణలో తిరుపతి అర్బన్, రూరల్ మండలాల తహసీల్దారు కార్యాలయాలున్నాయి. వాటికి చుట్టూ ప్రహరీ కూడా ఉంది. ఆ కార్యాలయాలకు చుట్టూ అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. పలు శాఖల కార్యాలయాలున్నాయి. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వాయువ్య మూల పదేళ్ల కిందట వెంకటేశ్వరస్వామి ఆలయం పేరిట చిన్న మందిరం నిర్మించారు. చూస్తుండగానే ఆ మందిరానికి చుట్టూ ప్రహరీ ఏర్పడింది. ఆపై ధ్వజస్తంభం, తర్వాత బలిపీఠం.. ఇలా అంతకంతకూ మందిరం ఆలయంగా ఆవిర్భవించింది. ఆవరణలో ఒక మూలకు పరిమితమైన మందిరం కాస్తా ఇపుడు ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసింది. తహసీల్దారు కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూర్చునేందుకు ఆవరణలో వేపచెట్టు, దానిచుట్టూ అరుగు ఉండగా ఆలయానికి అడ్డుగా ఉందని చెట్టును నరికివేయించి, అరుగు కూడా తొలగించేశారు. తాజాగా రాజగోపురం కూడా నిర్మించారు. రెండు సెంట్లలో ఉన్న మందిరం ఇప్పుడు ఐదు సెంట్లకు విస్తరించింది. కార్యాలయానికి జనం రాకపోకలను కూడా అసౌకర్యంగా మార్చేశారు. ఇదంతా ఆవరణలో సంగతి.



అర్బన్ తహసీల్దారు కార్యాలయానికి పడమరగా రోడ్డు పక్కన నిర్మించిన స్టోర్ రూమ్

తిరుపతిలో రెవెన్యూ దేవస్థానం

అది ప్రభుత్వ కార్యాలయ ఆవరణ. ఒక మూలన చిన్న మందిరం రేకుల షెడ్డులో వెలిసింది. పనులపై వచ్చీపోయేవాళ్లు దణ్ణం పెట్టుకుంటారులే అనుకున్నారు. నిదానంగా అది ఆలయంగా మారిపోయింది. గుడి, గోపురం, ప్రాకారం, వాహన మండపం.. ఇలా ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిలో అన్ని హంగులూ ఏర్పడ్డాయి. అంతటితో ఆగకుండా రోడ్డునూ, ప్రాకారం బయట ప్రాంతాన్నీ కూడా ఆక్రమించేస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆఫీసులో ఇదేమిటని అడిగేవాళ్లు మాత్రం లేకపోవడమే విచిత్రం.

- ఆ పేరుతో ఖరీదైన ప్రభుత్వ భూముల ఆక్రమణ
- దారులు కూడా మూసేసి ఇష్టారాజ్యంగా నిర్వహణ
- ఆలయ నిర్వహణకు చందాల వసూలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తిరుపతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఓ చిన్నపాటి మందిరంగా నిర్మితమైన వెంకటేశ్వరస్వామి దేవాలయం పేరిట చుట్టుపక్కల ఖరీదైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. తొమ్మిదేళ్ల వ్యవధిలో కార్యాలయ ఆవరణ మొత్తాన్నీ ఆక్రమించేసిన నిర్వాహకులు ఆపై ప్రహరీ దాటి వెలుపల కూడా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలకు వెళ్లే దారులు సైతం మూసేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయం పేరిట వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో బహిరంగంగా ఈ తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విచిత్రం.



అర్బన్ తహసీల్దారు కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ఆలయం

అనుమతి లేకున్నా..

తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నిర్మితమై అంతకంతకూ విస్తరిస్తున్న ఆలయానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులూ లేవు.అయితే ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరయ్యాయనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ సంబంధిత పనులపై వచ్చే వారి నుంచి ఆలయం పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

ఖరీదైన భూముల ఆక్రమణ

తహసీల్దారు కార్యాలయానికి వెలుపల ఉత్తర, పడమర దిశల్లో రోడ్లు, వాటిని ఆనుకునే అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి. కార్యాలయం ముందు ఉత్తర దిశగా ఉన్న రోడ్డుకు శాశ్వతంగా రేకులతో పందిళ్లు వేసేశారు. రోడ్డుకు ఉత్తరంగా ఖాళీ స్థలంలో వాహన మండపం ప్రత్యక్షమైంది. పడమర ఖాళీ స్థలంలో కూడా వాహనాలు భద్రపరిచేందుకు, ఇతర వస్తువులు ఉంచేందుకు స్టోర్ రూమ్ వెలిశాయి. ఉత్తరంగా ఉన్న రోడ్డు ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచీ తహసీల్దారు కార్యాలయం మీదుగా జిల్లా గ్రంథాలయ సంస్థ, జీఎస్టీ, డీఆర్‌డీఏ తదితర కార్యాలయాలతో పాటు జిల్లా పోలీసు కార్యాలయానికి వెళుతుంది. ఉత్సవాల పేరిట తరచూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఈ రోడ్డును మూసివేసి డైవర్ట్ చేస్తున్నారు. పడమర వైపు రోడ్డు యూత్ హాస్టల్, డ్వామా కార్యాలయాలతోపాటు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు వెళుతుంది. 40 అడుగుల ఈ రోడ్డును సగం ఆక్రమించేశారు. ఉత్సవాల పేరిట ఆ రోడ్డును కూడా రోజుల తరబడీ మూసేస్తున్నారు. దీనిపై యూత్ హాస్టల్ అధికారులు పలుమార్లు అభ్యంతరం తెలిపినా ఉపయోగం లేకుండాపోయింది. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఢిల్లీ టూ తిరుపతి

- రూ.8 కోట్ల విలువైన 10 టన్నుల ఎర్రచందనం స్వాధీనం
- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు
- ప్రధాన నిందితుడి కోసం గాలింపు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసుల ఆపరేషన్ సక్సెస్ అయింది. ఢిల్లీ గోడౌన్లలో దాచి ఉంచిన దాదాపు రూ.8 కోట్ల విలువైన 10 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని, తిరుపతికి తీసుకొచ్చారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పట్టుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు శనివారం వెల్లడించిన వివరాల మేరకు.. హైదరాబాదు హకీంపేటలో కాపురముంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్, మహారాష్ట్ర కరాడ్ తహసీల్‌కు చెందిన అమిత్ సంపత్ పవార్ ఎర్రచందనాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఇటీవల కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు ప్రాంతంలో తమిళనాడుకు చెందిన రాజ్‌కుమార్‌ను పట్టుకుని విచారించారు. శేషాచలం అడవుల నుంచి తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు ఎర్రచందనాన్ని కొల్లగొట్టి ఢిల్లీలోని గోడౌన్లలో దాదాపు 10 టన్నులు దాచి ఉంచినట్లు బయటపెట్టాడు. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాదర్ బాషా, సిబ్బంది ఢిల్లీ పోలీసులు, ఫారెస్టు అధికారుల సహకారంతో సౌత్ ఈస్ట్ ఢిల్లీ తుగ్లకాబాద్ ప్రాంతంలో రెండు రోజుల పాటు తనిఖీలు చేశారు. ఈనెల 6న ఎర్రచందనం అంతర్రాష్ట్ర స్మగ్లర్ మొహమ్మద్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా తుగ్లకాబాద్, కుయన్ మొహల్లా ప్రాంతంలోని గోడౌన్ నెంబరు 366పై దాడి చేసి 10 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను ఢిల్లీ కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై తిరుపతికి తీసుకొచ్చారు. ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.



ఢిల్లీ నుంచి తిరుపతికి తీసుకొచ్చిన ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

సిబ్బందికి అభినందనలు

ఢిల్లీ గోడౌన్‌లో అక్రమంగా దాచి ఉంచిన 10 టన్నుల ఎర్రచందనాన్ని పట్టుకోవడంలో కృషి చేసిన టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, షరీఫ్, సీఐలు షేక్ ఖాదర్‌బాషా, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐ మురళీధరరెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, షేక్‌బిలాల్, చిన్నికృష్ణయ్యలను టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు, ఫారెస్టు అధికారి సెల్వం అభినందించారు.

నేలపట్టులో విదేశీ పక్షుల దినోత్సవం

దొరవారిసత్రం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం విదేశీ పక్షుల దినోత్సవం నిర్వహించారు. దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులకు విదేశీ పక్షుల విడిదిపై నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య అవగాహన కల్పించారు. పక్షుల వల్ల ఈ ప్రాంతం ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందడం, అవి రైతాంగానికి చేసే మేలు గురించి వివరించారు. పక్షుల జీవన విధానంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. శ్రీసిటీలో పనిచేసే నలుగురు జర్మనీ దేశస్థులు పక్షుల కేంద్రాన్ని పరిశీలించారు. పక్షుల విడిది ఇంకా మొదలు కాలేదని, ఈ వారంలో వచ్చే అవకాశాలున్నాయని వన్యప్రాణి సంరక్షణశాఖ అధికారులు వారికి తెలియజేశారు. కంపెనీ ఆవరణలో నాటాలని ఎఫ్ఆర్‌వో వారికి జమ్మి చెట్టు మొక్కలను అందజేశారు.



జర్మనీ పర్యాటకుడికి మొక్క అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో సౌజన్య

ఎన్టీఆర్ వైద్యసేవలకు ఢోకా లేదు

తిరుపతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేయాలని హాస్పిటల్స్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం జిల్లాపై పెద్దగా ప్రభావం కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా 38 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటే కేవలం 4 ఆస్పత్రుల్లో మాత్రమే ఓపీ సేవలు నిలిచాయి. వీటిల్లోనూ అత్యవసర వైద్యసేవలకు ఎక్కడా ఆటంకం జరగలేదని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని సంకల్ప, రష్ ఆస్పత్రులతోపాటు గూడూరులోని సీఆర్ రెడ్డి, మైథిలి ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేశారన్నారు. తొలుత వాసన్ ఐకేఆర్ ఆస్పత్రి కూడా వైద్యసేవలు నిలిపివేసి, శనివారం కొనసాగించిందన్నారు.

పంచాయతీల్లో పదోన్నతుల జాతర

- గ్రేడ్ 1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ప్రమోషన్
- ఇతర జిల్లాల నుంచి ఏడుగురి రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గాజులమండ్యంలో పనిచేస్తున్న గిరిధర్, ఆర్సీపురం మండలం పీవీపురంలో పనిచేస్తున్న షణ్ముగంకు, నారాయణవనంలో పనిచేస్తున్న సీపీ షణ్ముగంకు డిప్యూటీ ఎంపీడీవోలు(ఈవోపీఆర్డీ)గా పదోన్నతి లభించింది.అలాగే బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఏడుగురు డిప్యూటీ ఎంపీడీవోలను తిరుపతి జిల్లాకు కేటాయించారు. త్వరలో వీరిని ఖాళీగా ఉన్న మండలాలకు కేటాయించనున్నట్లు డీపీవో సుశీలాదేవి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 14 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకేసారి పది పోస్టులు భర్తీ కానున్నాయి.

ఎస్బీలో బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన దిశగా ఎస్పీ సుబ్బరాయుడు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఏళ్ల తరబడి తిష్ఠవేసిన ఏడుగురిని అలిపిరి, ఎమ్మార్‌పల్లె, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. అలాగే శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న చెంచురామయ్యను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, అలిపిరిలో పనిచేస్తున్న కుమారస్వామిని తిరుమల ఎస్బీకి బదిలీ చేశారు. అలాగే తిరుపతి ఎస్పీ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న జాకీర్‌హుస్సేన్, షణ్ముగం, ప్రశాంత్‌కుమార్, హరిప్రసాద్‌లను వారు పనిచేస్తున్న పోలీస్ స్టేషన్లకు పంపించేశారు.

SUNDAY SPECIAL

నేనున్నానని..

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

6



అంబేడ్కర్ విగ్రహంతోనా రాజకీయం?

- కులాల మధ్య చిచ్చు పెడతామంటే ఊరుకోం
- వైసీపీ నాయకులపై హోంమంత్రి అనిత ఫైర్



దేవళంపేట సభలో ప్రసంగిస్తున్న హోంమంత్రి అనిత

వెదురుకుప్పం/పెనుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళుతుండడం చూసి ఓర్వలేక జగన్ అండ్ బ్యాచ్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు.వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రెండు వారాల క్రితం అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ,దాన్ని టీడీపీ పైకి నెట్టేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన వైసీపీ నాయకుల కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే.వైసీపీకి చెందిన సర్పంచ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు చేసి జైలుకు పంపించారు.మరోవైపు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన రోజు సాయంత్రమే ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్ అక్కడ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో శనివారం హోంమంత్రి అనిత దేవళంపేటకు వచ్చారు. జోరు వాన కురుస్తున్నా చిత్తూరు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని సమాచారం రాగానే పోలీసులకు ఫోన్ చేసి వెంటనే దోషులను గుర్తించి వాళ్లు ఎవరైనా చర్యలు తీసుకోవాలని సూచించానన్నారు.చివరకు వైసీపీ నేతల కుట్ర అని తెలియడంతో ఆశ్చర్యపోయానన్నారు.డిప్యూటీ సీఎంగా పని చేసిన నారాయణస్వామి తమ దండుపాళ్యం బ్యాచ్‌తో వచ్చి టీడీపీ నేతలను అరెస్టు చేయాలని పోలీసులను కోరడంపై ఆమె మండిపడ్డారు.ఆయనకు వయసు పెరిగింది కానీ, బుద్ధి పెరగలేదని ధ్వజమెత్తారు.ధర్నాలు చేయడం, రెచ్చగొట్టడం, తగలబెట్టడం.... తీరా దొరికాక తమకేమీ తెలియదంటూ బుకాయించడం వైసీపీ నైజం అన్నారు.ఎక్కడైనా ఏవైనా జరగరాని సంఘటనలు జరిగినప్పుడు ఎలా జరిగింది, ఎవరు చేశారు అని నిర్ధారించుకున్నాకే కార్యాచరణకు దిగాలని దళిత సంఘాలకు ఆమె సూచించారు.అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాష్ట్ర సమస్యగా చేయాలనుకున్న వైసీపీ కుట్రను భగ్నం చేసి నిజానిజాలను ప్రజలకు తెలియజేసిన చిత్తూరు పోలీసులను హోంమంత్రి అభినందించారు.'చిత్తూరులో గ్యాంగ్ రేప్ జరిగితే, ఆ నిందితుల్ని వెంటనే పట్టుకుని ముసుగు వేసి తీసుకెళ్లలేదు. బేడీలు వేసి నడిరోడ్డుపై నడిపించుకుంటూ వెళ్లారు' అంటూ ఆమె పోలీసులకు కితాబునిచ్చారు.రాజకీయ ముసుగులో వున్న నేరస్తులను గుర్తించి కటకటాల వెనక్కు పంపాలని సూచించారు.జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి డిప్యూటీ సీఎం దాకా ఎదిగిన నారాయణస్వామి తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తానంటూ దళిత ఆత్మగౌరవాన్ని జగన్ కాళ్ల దగ్గర పెట్టిన ద్రోహి అంటూ మండిపడ్డారు.ఎక్సైజ్ మంత్రిగా ఇష్టానికి దోచుకుని కుమార్తెలకు పంచిపెట్టిన ఆయన దళితులతో రాజకీయం చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.వాళ్లు ఒక్క విగ్రహాన్ని కాల్చితే తాము వెయ్యి విగ్రహాల్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అండగా దళితులున్నారని గ్రహించిన వైసీపీ నేతలు ఎస్సీ నియోజకవర్గాలను టార్గెట్ చేస్తూ దుష్టపన్నాగాలు మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక్కడ కాలిన మంట మరో చోటకు వ్యాపించకుండా ఉండాలంటే దోషులను శిక్షించడం మాత్రమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అందు కోసమే హోం మంత్రి దేవళంపేటకు వచ్చారన్నారు.మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ అన్ని జాతులవారూ కలిసి మొక్కాల్సిన దేవుడు అంబేడ్కర్‌ను కూడా నీచ రాజకీయాలకు వాడుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, మాజీ ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.


రేఖారాణి

శ్రీవారి సేవలో ప్రముఖులు


హరితేజ

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ కమిషనర్ రేఖారాణి, సినీనటి హరితేజ, చెన్నై సిటీ కమిషనర్ అరుణ్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తులు

జస్టిస్ బీ కృష్ణమోహన్ - జస్టిస్ రవి చీమలపాటి

తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో జస్టిస్ బీ కృష్ణమోహన్, జస్టిస్ రవి చీలమపాటి దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,468

తలనీలాలు సమర్పించినవారు: 26,878




పిల్లలకు పిజ్జా తినిపిస్తూ..

చౌడేపల్లెకు చెందిన రెడ్డెప్ప పుట్టుకతో అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ స్కూల్లో పాటలు పాడటంలో నేర్పరి. ప్రేరణ సేవా సంస్థ ప్రోత్సాహంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఎంఎన్‌ఆర్ పాఠశాల అండ్ కళాశాలలో సంగీత ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

తిరుపతి బైరాగిపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లలకు సముద్రం చూడాలనే కోరిక కలిగింది. వారి కోరికను తీర్చేందుకు 'ప్రేరణ' ముందుకువచ్చింది. ఆనందసాగరంలో ముంచెత్తి వారితో సంతోషాన్ని పంచుకుంది.

శ్రీవెంకటేశ్వర డెఫ్ అండ్ డమ్ పాఠశాల విద్యార్థులకు 'ప్రేరణ' అందించిన శిక్షణ జీవితాల్లో వెలుగులు నింపింది.


సముద్రంలో జలకాలాడుతూ మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లల ఆనందం


ఎస్వీడీడీ పాఠశాల విద్యార్థుల నృత్యం


ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను ఆడిస్తున్న ప్రేరణ సభ్యులు


వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాటామంతి

నేనున్నానని...

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

18ఏళ్ల మానవతా ప్రస్థానంలో ఎందరికో చేదోడువాదోడు


ఆశ్రమంలో నిత్యావసరాలను అందిస్తూ..

ఆంధ్రజ్యోతి - తిరుపతి(కల్చరల్)

అసహాయులకు తోడుగా నిలుస్తోంది. ఆనందాన్ని పంచుతోంది. వారిలోని ప్రతిభకు పట్టం కడుతోంది. సేవకు ప్రతిరూపమై ప్రత్యేక ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది ప్రేరణ సేవా సంస్థ. ముగ్గురు విద్యార్థుల ఆలోచన ఫలితమే ఈ మానవతా సంస్థ ఆవిర్భావానికి బీజం వేసింది. తిరుపతిలోని శ్రీవిద్యానికేతన్‌లో బీఎస్సీ బయో టెక్నాలజీ చదువుతుండగా రాజశేఖర్, భార్గవి, విద్యాశ్రీలకు ఎదురైన అనుభవాలూ ఈ సంస్థ ఏర్పాటుకు కారణమైంది. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న బాలల్ని ఈ విద్యార్థులు చూశారు. చదువుకోవాల్సిన చిన్నారులు దారి తప్పిన తీరు తెలుసుకుని చలించిపోయారు. చదువుపై ఆసక్తి చూపిన వారికి పుస్తకాలు కొనిచ్చారు. కొంతమంది స్వార్థంతో ఇలాంటి పిల్లలు చెడు దారి పడుతున్నారని గుర్తించారు. బాధిత పిల్లలను చేరదీసి ఆశ్రమంలో చేర్పించారు. ఈ సంఘటనలు ఆ ముగ్గురు విద్యార్థులనూ సేవాపథం వైపు నడిపించాయి. 2008లో తమ కళాశాల అధ్యాపకులు శ్రీలత, రవీంద్రల ప్రోత్సాహంతో వీరు ప్రేరణ పేరిట హెల్పింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో సహచరుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించేవారు. ఏడాదిలోపు 43 మంది సభ్యులకు సంస్థ చేరింది. ఇప్పుడు సుమారు 300లకు పైగా సభ్యులతో బలమైన వృక్షంగా మారింది. ఈ సంస్థలో సభ్యులంతా విద్యార్థులే. వివిధ కళాశాలల్లో చదుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పం ఉన్నవారే.

ఎక్కడ ఉన్నా వీడని బంధం..

ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆరంభంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయినా ప్రేరణతో బంధం వీడలేదు. వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూనే తమ జూనియర్స్‌ను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తున్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో రాజశేఖర్ తిరుపతి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్నారు. భార్గవి చెన్నైలో, దిగ్విజయ్ బెంగళూరులో పనిచేస్తున్నారు. ఇలా పలువురు ప్రేరణ సభ్యులు ఉద్యోగాలూ చేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా వార్షికోత్సవం వచ్చిందంటే రెక్కలు కట్టుకుని తిరుపతిలో వాలిపోతున్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, సంగీత కార్యక్రమాలు నిర్వహించి వారితో సంతోషాలను పంచుకుంటున్నారు.

ఓ విద్యార్థిని కోసం వార్షికోత్సవం..

తొలి ఏడాది సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నవజీవన్ బ్లైండ్ స్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలో రోజా అనే విద్యార్థిని బాధపడుతూ కనిపించింది. జ్వరం జలుబు, దగ్గు కారణంగా పోటీల్లో బాగా పాడలేకపోయానని రోదించింది. ప్రేరణ సభ్యుల్లో ఒకరైన భార్గవి ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుంది. మంచి వేదికపై పాటపాడే అవకాశం కల్పిస్తామని మాటిచ్చింది. దాంతో ఆ విద్యార్థిని పట్టలేని ఆనందంతో గంతేసింది. ఆ అమ్మాయికి ఇచ్చిన హామీ నెరవేర్చాలనే క్రమంలో పుట్టుకొచ్చిందే తొలి వార్షికోత్సవ నిర్ణయం. వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆర్థికంగా స్థోమత లేకున్నా ధైర్యంగా ముందడుగు వేశారు. తమ తరగతితో పాటు ఇతర తరగతులు.. వివిధ విద్యాసంస్థల్లో విరాళాలు సేకరించారు. మొత్తం మీద తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేదికపై రోజా కమ్మని గీతంతో అందరి హృదయాలను దోచుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటి టీటీడీ ఈవో కేవీ రమణాచారి ప్రేరణ సేవలను అభినందించారు. మహతిలో ఎప్పుడు కార్యక్రమం నిర్వహించాలన్నా ఉచితంగా అవకాశం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. 2008లో తొలి ఏడాది వార్షికోత్సవంలో అందిన ప్రోత్సాహంతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంది 'ప్రేరణ' సేవా సంస్థ.


రెడ్డెప్ప



ప్రేరణ సభ్యులు

మురికి కాలువలో పసికందు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో ఇంకా కళ్లు కూడా తెరవని పసికందును మురికి కాలువలో పడేసింది. తిరుపతి సింగాలగుంటలోని మసీదు వీధిలో కాలువలో పడి ఉన్న ఆ పసికందు శవాన్ని అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. స్థానిక వీఆర్‌వోకు సమాచారం అందించారు. వీఆర్వో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ అజిత అక్కడికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

- ఉన్నత విద్యకూ అవకాశం

తిరుపతి(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంతోపాటు కంపెనీ ఆర్థిక సాయంతో ఉన్నత చదువులు చదివే అవకాశం కూడా కల్పించనున్నారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పెద్దగా ఉద్యోగావకాశాలు ఉండని క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంటర్ విద్యామండలి హెచ్‌సీఎల్ ద్వారా ఈ మేళాను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్, ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 2024, 2025 సంవత్సరాల్లో కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టెక్‌బీ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి సంవత్సరంపాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి నెలకు రూ.2.20 లక్షల జీతంతో ఉద్యోగం లభిస్తుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు **https://bit.ly/TechbeeGoAP** లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు 13వ తేదీన ఎంపికల సమయంలో కంపెనీ ప్రతినిధులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇతర వివరాలకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధి ఎస్.రాజ్‌కుమార్‌ను 7780323850లో సంప్రదించవచ్చునని వివరించారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో వెంగమాంబ అన్నప్రసాద భవనం వెలుపల గేటు వద్ద అచేతనంగా పడి ఉండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ముక్కంటి ఆలయంలో 22నుంచి కార్తీక మాస పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయం తెరచు వేళలు, సోమవారం రోజున ప్రాతఃకాల అభిషేకాలు, పవళింపు సేవల సమయాలలో మార్పులు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. మోహనమంత్ర




ఉర్రూతలూగిస్తున్న డీజే - పాల్గొన్న విద్యార్థులు - కేరళ వాయిద్యాలను తిలకిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహనమంత్ర కార్యక్రమం రెండవ రోజు శనివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. హర్రర్ హౌస్, కళాక్షేత్ర, రాంప్‌వాక్,ఫొటోషూట్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, బ్రేక్ డ్యాన్స్ డ్రాగన్ ట్రెయిన్, ట్రెజర్ హంట్ తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం డీజే పరోమా (ముంబై) ప్రొ షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా ఎంబీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగరాజరామారావు మాట్లాడుతూ నిర్వహించిన వర్క్‌షాపులు విద్యార్థుల మేధోసంపత్తికి దోహదపడ్డాయన్నారు. కాగా కళావేదికపై విద్యార్థులు నిర్వహించిన నృత్య గాన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. టెక్నికల్ విభాగంలో రోబోవార్స్ కార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సందడి చేశారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గువ్వలకాలనీలో శ్రీహరి హత్య కేసులో నిందితుడు ఎన్.మేస్త్రీ(33)ని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ ఎం.మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. మేస్త్రీ భార్య భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో శ్రీహరి మేస్త్రీని హేళనగా మాట్లాడాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం టిఫిన్ సెంటర్ వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో మేస్త్రీ తన జేబులో నుంచి కత్తిని తీసి శ్రీహరి మెడపై పొడవంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీహరి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.


నిందితుడు మేస్త్రీని అరెస్టు చేసిన పోలీసులు

21 ఎర్రచందనం దుంగల స్వాధీనం



మంగళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం గొల్లపల్లి బీట్ పరిధిలో శనివారం తిరుపతి అటవీ శాఖ అధికారులు కూంబింగ్ నిర్వహించి పొదల్లో దాచి ఉంచిన 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి వడమాలపేట మండలం పాదిరేడు సెక్షన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా గొల్లపల్లి వద్ద పొదల్లో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలు అధికారుల కంటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, బీట్ ఆఫీసర్లు మునినాయక్, జ్యోతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుల నియామకం

శ్రీకాళహస్తి, అక్టోంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డులో ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితుల పేర్లతో అధికారులు శనివారం అధికారిక జీవోను విడుదల చేశారు. చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడికి అవకాశం కల్పించారు.

పంట పొలాలపై 'గజ'దాడులు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లంపల్లె గ్రామ అటవీ ప్రాంత సమీప పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. సాయంత్రం 6 గంటలకు ఏనుగుల గుంపు పులిచెర్ల అడవుల్లో నుంచి యల్లంపల్లె అటవీ ప్రాంతంలోకి చొరబడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో 8 ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుండటంతో గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు, గ్రామస్తులు కలిసి ఏనుగులు గ్రామంలోకి రాకుండా బాణసంచా పేల్చుతూ, డప్పులు వాయించారు. జ్ఞానప్రకాష్‌రెడ్డికి చెందిన వరి పైరును పూర్తిగా ధ్వంసం చేశాయి. పక్క పొలంలో ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేశాయి. శనివారం వేకువజాము వరకు అవి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే తిరుగుతుండటంతో యల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు ఇటువైపు రాకుండా అడ్డుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇరిగేషన్ పైపులైన్

ఆకట్టుకున్న శోభారాజ్ గాత్రకచేరి



శ్రీవారి సహస్రదీపాలంకార సేవలో ప్రముఖ గాయని శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామికి జరిగిన సహస్రదీపాలంకార సేవలో ఆమె పాల్గొన్నారు. శిష్య బృందంతో కలిసి శ్రీవారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుత 'అన్నమయ్య గాయత్రి' మంత్రంతో ప్రారంభించి 'హరియవతారమీతడు అన్నమయ్య', 'ఈరూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము' అను కీర్తలను రసరమ్యభరితంగా ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం కానుక


అభిషేక సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం అభిషేక సింహాసనం బహూకరించారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, యువజ్యోతిలు సుమారు రూ.9 లక్షల విలువ గల బంగారు పూత కలిగిన రాగి అభిషేక సింహాసనాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చకులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసు

సత్యవేడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీకి ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్‌ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ అతని భార్య తేజశ్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్రతోపాటు పట్టాలు పొందిన పీ.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్ పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తిరుపతి-అనకాపల్లి మధ్య 2 నుంచి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి ఆదివారం, అనకాపల్లిలో ప్రతి సోమవారమూ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు (07481) ఆదివారం బయలుదేరి అనకాపల్లికి మరుసటి రోజు(సోమవారం) చేరుకుంటుంది. అదేరోజు ఈ ప్రత్యేక రైలు (07482) అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయం సమీపంలో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి వెంకటేశ్వరస్వామి అమ్మవారి ఉత్సవ మూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేసి వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. కల్యాణోత్సవంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి దంపతులు, ఆలయ అర్చకులు కార్తీక్ శర్మ పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేతలు

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో శనివారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు చేపట్టవలసిన చర్యలపై ఆయన పలు సూచనలు చేసినట్లు చెప్పారు.



షార్ రోడ్డుకు రివిట్‌మెంట్

కోతకు గురికాకుండా షార్ అధికారులు

సూళ్లూరుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు కోతకు గురికాకుండా షార్ యాజమాన్యం చర్యలు చేపట్టింది. కుదిరి సమీపం నుంచి షార్ ముఖద్వారం వరకు పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా రక్షణ కవచంలా రివిట్ మెంట్ నిర్మాణం చేపట్టారు. ఏటా నవంబరు, డిసెంబరు మాసాల్లో వరదలకు పులికాట్ సరస్సుకు భారీగా వరదనీరు రావడంతో షార్‌కు వెళ్లే రోడ్డు చాలాచోట్ల కోతకు గురై ధ్వంసం అవ్వడం, కల్వర్టులు కుంగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలు సందర్భాల్లో పులికాట్ నీరు పొంగి ప్రవహించడంతో తరచూ రోడ్డు మరమ్మతులకు గురవుతోంది. దీంతో వర్షాకాలంలో రోడ్డు కోతకు గురికాకుండా వరదనీరు వేగంగా ప్రవహించేందుకు అక్కడక్కడ కల్వర్టులు నిర్మించారు. అలాగే కుదిరి గ్రామ సమీపం నుంచి షార్ ముఖద్వారం వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా సుమారు రూ.80 లక్షల వ్యయంతో రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. పులికాట్ సరస్సు నీరు ఉధృతంగా ప్రవహించే చోట రోడ్డుకు రక్షణగా దాదాపు 5 మీటర్ల వరకు గులకరాళ్లు సైతం అమర్చి రోడ్డుకు రక్షణ కవచంలా పనులు చేపట్టారు.



షార్ రోడ్డు కోతకు గురికాకుండా నిర్మించిన రివిట్‌మెంట్

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా తెలియచేయడమేమనగా తే.01-04-1993దిన ఈ క్రింద కనుబరచిన భాగస్తులతో '**శ్రీ జయలక్ష్మి డెకార్టికేటర్స్**' పేరుతో పూర్వపు నెల్లూరుజిల్లా కోట నందు ఈ క్రింద షెడ్యూలు స్థలము నందు వ్యాపారము కొనసాగించుటకు పార్టనర్ షిప్ డీడ్ రీకాన్‌స్టిట్యూట్ చేసుకొని వ్యాపారము కొనసాగించుచున్నారు. భాగస్తుల పేర్లు వరుసగా **1) కాటంరెడ్డి రామలింగారెడ్డి, 2) గండవరం రవీంద్రరెడ్డి, 3) దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, 4) బిల్లే ఈశ్వరయ్య, 5) దేవరెడ్డి జానర్ధనమ్మ, 6) గండవరం రజని, 7) అల్తూరు నవనీతమ్మ, 8) అల్తూరు సురేఖ** పై వారిలో ఏడవ వారు **అల్తూరు నవనీతమ్మ** మరణించినారు. కాని ఇటీవల భాగస్వాములు మధ్య మనస్పర్థల వల్ల సదరు భాగస్వామ్య వ్యాపారము తాత్కాలికముగా నిలిపివేయబడినది. కాని భాగస్వామ్య రద్దు కాబడలేదు. వ్యాపార లైసెన్స్ కూడా రద్దు కాబడలేదు.

తదుపరి భాగస్వాములలో రెండవారు **గండవరం రవీంద్రరెడ్డి** మరణించినారు. ఇది అదనుగా తీసుకొని **రవీంద్రరెడ్డి** మరియు ఆరవ భాగస్తురాలైన **రజని గార్ల కుమార్తె గండవరం సుష్మ** మిల్లు స్థలాన్ని స్వంతం చేసుకొని అమ్ముకొను దురుద్దేశముతో తే.14-09-25దిన రాత్రి గం.8.30 ని.లకు మిల్లు రేకులను తొలగించి, మిల్లు షెడ్డును JCBతో ధ్వంసం చేయించినారు. మిల్లుకు సంబంధించిన మిషనరీ మరియు సామగ్రిని అమ్ముకొన్నారు. సదరు సంఘటన గురించి పోలీసు రిపోర్టు కూడా యివ్వడం జరిగింది. **గండవరం సుష్మ** తన తల్లి పార్టనర్ అయిన **రజనితో** కుమ్మక్కై రెవెన్యూ ఉద్యోగులను లోబరుచుకుని సదరు స్థలముకు 1(B) మోసపూరితముగా పొంది ఇతరులకు అమ్ముటకు ప్రయత్నించుచున్నారు. లోగడ గండవరం సుష్మ తన తల్లి భాగస్తురాలైన **రజనీ** చేత షెడ్యూలు స్థలములో కొంత భాగమును ఇతరులకు అమ్మినట్లు తెలియుచున్నది. సదరు కొనుగోలు చేసిన వారిపై కూడా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబోవుచున్నాము.

కావున నా క్లయింట్లు సదరు వ్యాపారములో భాగస్తులైన **దేవరెడ్డి జనార్ధనమ్మ** మరియు **దువ్వూరు శ్రీనివాసులురెడ్డి** తెలియచేయడమేమనగా సదరు గండవరం సుష్మకు పై భాగస్వామ్య వ్యాపారములో ఏ విధమైన సంబంధం లేదు. మరియు క్రింది షెడ్యూలు ఆస్తిని ఎవరుగాని, ఏ పార్టనర్ గాని ఇతరులెవరికి అమ్ముటకు హక్కు అధికారము లేదు.

కావున ఏ ఒక్క పార్టనర్ ఇతర పార్టనర్‌ల అందరి అనుమతి లేకుండా షెడ్యూలు ఆస్తి గురించి ఎటువంటి లావాదేవీలు ఎవరితో జరిపినను నా క్లయింట్లను బద్ధగించవు. అవి చెల్లనేరవు. షెడ్యూలు ఆస్తి గురించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదని హెచ్చరించడమైనది. అట్లు జరిపిన ఎడల వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

ఆస్తి షెడ్యూలు

"Sri Jayalakshmi Decordicators: situated at Branch Road, Survey No.1237/A2 of Patta No.13-Kota Bit-I with in the jurisdiction of Kota Sub Registry in Nellore Registration District. The total extent of land Ac.1-39 cents or H.0.563 The construction in this land is as follows;- Ground Nut decordicator shed of A.C.Sheet Roof 2373 sft or 32.958 Ankanams or 220.456 sq.meters R.C.C.Roof Ground Floor : 300 sft. or 4.167 Ankanams or 27.873 sq.meters, First Floor: 300 sft or 4.167 Ankanams or 27.873 sq.meters. G.I.Sheet Roof Godown 1755.775 sft. or 24.385 Ankanams or 163.111 sq.meters. together with Plant and Machinery, Electrical fittings all fitted or affixed here to and bounded on the East: Site belonging to Malapati Krishna Reddy and Mareddy Ramachandra Reddy, West: Own compound wall constructed upto basement level abutting land belonging to Paluru Bala Subrahmanyam and Gogupaka Mastanaiah, North: Kallam-open space and well abutting main Road, South: Vacant site of Murari Kootalaiah.

14/100th undivided share out the above property is released.

Note: The land affecred by this document is not an assigned land pattadars pass book was not issued.

The Land effected by this documents does not belong to Government or its agencies or its undertakings and this is not mortgaged to them.

వేనాటి చంద్రశేఖరరెడ్డి, B.A., B.L.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్: 98490 02833

పేదలకు ఆసరా సీఎం సహాయనిధి: పాశిం

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు చికిత్స చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో 39 మంది లబ్ధిదారులకు రూ.19.46లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు మెరుగైన వైద్యచికిత్స పొందేందుకు వీలుగా సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సీఎం సహాయనిధిని నిర్వీర్యం చేసిందని, ఏ ఒక్కరికీ సాయం అందించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మందికి ఈ పథకం ద్వారా చెక్కులను అందజేశామన్నారు. ఎవరికైనా ఇబ్బందులుంటే తమ కార్యాలయంలో సంప్రదిస్తే సాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, నరసింహులు, వేముల సునీల్, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పెళ్లకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన మీడియా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా.. రోడ్లపై వీరంగం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో యువత చేస్తున్న తప్పుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి... జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతున్న వారు కొందరైతే... ప్రాణాలు కోల్పోయి మరికొందరు కుటుంబసభ్యులు అనాథలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ మండల పరిధిలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపడుతున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల స్వామి ఆలయం వద్ద నూతనంగా శివాలయం నిర్మించనున్నారు. ఇందుకోసం ఆలయ వ్యవస్థాపకులు కారంశెట్టి మల్లికార్జునరావు, సుమతి దంపతులు శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం శనివారం అందజేశారు. కార్యక్రమంలో వాసు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మల్లికార్జునరావు దంపతులు

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ పాలకమండలి సభ్యురాలిగా భూలక్ష్మి

నాయుడుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనక దుర్గమ్మ ఆలయ పాలక మండలి సభ్యురాలిగా నాయుడుపేట పట్టనం బీరదవాడకు చెందిన పనబాక భూలక్ష్మీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న పనబాక భూలక్ష్మికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న భూలక్ష్మి

బాలసదన్ విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ

కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన సూళ్లూరు చిరంజీవి వర్ధంతి సందర్భంగా ఆయన బంధువులు పురిణి నాగభూషణం, పురిణి శ్రీనివాసులు కోటలోని బాలసదన్ విద్యార్థినులకు బ్యాగులు, పండ్లు ఎస్ఐ పవన్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అనురాధ, జయలక్ష్మి, నాగమణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో బాలికల దినోత్సవం

సూళ్లూరుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట ఎర్రబాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో జ్యోతి కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికలను బాలురలతో సమానంగా గౌరవించాలన్నారు. బాలికలు నలుగురిలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడాలి అనే అంశంపై చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది సురేఖ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో...

కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, కౌమార దశలో వచ్చే లక్షణాల గురించి అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత మాట్లాడుతూ బాలికలను చదువుల్లో ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం ఎస్ఎస్ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన మస్తానమ్మ(55)కు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదు. శనివారం ఉదయం ఎస్ఎస్ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందింది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన బాలిక అప్పగింత

డక్కిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం అదృశ్యం అయిన బాలికను శనివారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవపడి బాలిక ఇంటి నుంచి పారిపోయినట్లు తల్లిదుండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలించడంతో రాపూరు మండలం పెంచకోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉన్నట్లు సమాచారం అందింది. శనివారం ఆ బాలికను తీసుకువచ్చి తల్లిదుండ్రులు అప్పగించామని పోలీసులు చెప్పారు.

యువకుల ఘర్షణ

డక్కిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామంలో శనివారం ఇద్దరు యువకుల మధ్య వ్యక్తిగత కారణాల వల్ల చోటు చేసుకొన్న వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. పోలీసులు కథనం మేరకు... గ్రామానికి చెందిన మునికుమార్, శ్రీనివాసులు మధ్య గత వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఒకరిపై ఒకరు కర్రలతోదాడి చేసుకోవడంతో ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. వారిద్దరినీ వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం జరిగిందని, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్రామికనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రామిక నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, వివిధశాఖల అధికారులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు

కోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, శ్రీలక్ష్మమ్మ కాలనీ, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి విగ్రహాలకు అభిషేకాలు చేసి విశేష అలంకారంలో ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీలక్ష్మమ్మగిరిజన కాలనీలోని ఆలయ ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది.



నాయుడుపేట: విన్నమాల గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందజేశారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పూజారి విజయకుమార్ స్వామి, అత్తికాయల సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, బాలకృష్ణ, సుకన్య, పుల్లయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



గోవిందుడికి లక్ష్మీనరసింహస్వామి అలంకారం

సూళ్లూరపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మద్వేంకట రామమూర్తి స్వామి ఆలయంలో పెరటాసి మాసం నాలుగో శనివారం సందర్భంగా వెంకటేశ్వరస్వామికి లక్ష్మీనరసింహస్వామి అవతార అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృత, క్షీర, చందనంతో అభిషేకం చేశారు.

వీవోఏల కాలపరిమితి రద్దుపై హర్షం

పెళ్లకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్య సంఘాల్లో పనిచేస్తున్న వీవోఏ మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయడం పట్ల వీవోఏలు హర్షం చేశారు. శనివారం వీవోఏలు చంద్రసేన, సుబాషిణి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వీవోఏల కాల పరిమితిని మూడేళ్లకే పరిమితం చేసిందన్నారు. ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని పోరాటాలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వం తీసుకొచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు చంద్రసేన, సుభాషిణి, వజ్రమ్మ, సుబ్బలక్ష్మి, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.